ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
శ్రీ సత్యసాయి
జిల్లా వార్తలు
గురువారం 4 జనవరి 2024



▼కలెక్టరేట్‌ను ముట్టడించిన అంగన్‌వాడీలు

అడుగడుగునా పోలీసుల అడ్డంకులు

- కార్యకర్తలు, హెల్పర్లకు నోటీసులు, అరెస్టులు
- అయినా.. ఖాతరు చేయని వైనం
- వేల సంఖ్యలో కలెక్టరేట్‌కు..
- నినాదాలతో దద్దరిల్లిన పుట్టపర్తి

దండెత్తిన అంగన్‌వాడీలు!

కట్టడిని దాటుకుని కలెక్టరేట్ ముట్టడి



మాట్లాడుతున్న సీఐటీయూ నేత ఓబులు

పుట్టపర్తిరూరల్, జనవరి 3: కలెక్టరేట్ ముట్టడికి వెళ్తే కేసులు నమోదు చేస్తామని పోలీసులు నోటీసులు జారీ చేశారు. అయినా వెళ్లున్న వారిని ఎక్కడికక్కడ అడ్డుకుని, పోలీసు స్టేషన్లకు తరలించారు. అరెస్టులు చేశారు. అయినా.. అంగన్‌వాడీలు వెనక్కి తగ్గలేదు. వేలాదిగా దండెత్తారు. పుట్టపర్తిలోని జిల్లా కలెక్టరేట్‌ను ముట్టడించారు. పోలీసులు అడుగడుగునా అడ్డుకునే ప్రయత్నం చేసినా.. అంగన్‌వాడీలు ఖాతరు చేయలేదు. ముసుగులు ధరించి, నడుచుకుంటూ, ఆటోల్లో రకరకాల మార్గాల్లో పుట్టపర్తికి తరలివచ్చారు. సమస్యలు పరిష్కరించాలంటూ నినాదాలతో హోరెత్తించారు. సమస్యల పరిష్కారం కోరుతూ అంగన్‌వాడీలు చేపట్టిన నిరవధిక సమ్మె బుధవారం 23వ రోజుకు చేరుకుంది. జిల్లావ్యాప్తంగా ఉన్న అంగన్‌వాడీలు.. కలెక్టరేట్‌ను ముట్టడించారు. స్థానిక గణేష్ కూడలి నుంచి ర్యాలీ చేపట్టారు. అప్పటికే భారీగా మోహరించిన పోలీసులు.. కలెక్టరేట్‌కు వెళ్లకుండా అడ్డుకున్నారు. దీంతో వారు అక్కడే బైఠాయించి, ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పోలీసు వలయాన్ని ఛేదించుకుని కలెక్టరేట్‌కు చేరుకున్న అంగన్‌వాడీలు ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు అక్కడే బైఠాయించారు. వారికి సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు, జిల్లా ఉపాధ్యక్షుడు ఇంతియాజ్, శ్రామిక మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి దిల్షాద్ మద్దతు తెలిపారు. ఓబులు మాట్లాడుతూ.. ఢిల్లీ రైతుల ఉద్యమ స్ఫూర్తితో అంగన్‌వాడీలు పోరాటం సాగించాలన్నారు. అంగన్‌వాడీలు అలవిగాని గొంతెమ్మ కోర్కెలు కోరడం లేదనీ, ముఖ్యమంత్రి జగన్ పాదయాత్రలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని మాత్రమే డిమాండ్ చేస్తున్నారన్నారు. అధికారంలోకి వచ్చి నాలుగున్నరేళ్లు దాటినా సీఎం జగన్ హామీలు ఎందుకు అమలు చేయలేకపోతున్నారని ప్రశ్నించారు. ఎన్నికల ముందు అక్క, చెల్లీ ఒక్క అవకాశమనీ, సమస్యలన్నీ పరిష్కరిస్తానని ప్రాధేయపడి ఓట్లు వేయించుకున్న జగన్‌రెడ్డి ఇచ్చిన హామీలు మరిచిపోయారా అని ఆక్రోశించారు. హామీలను నెరవేర్చకుంటే తాను బటన్ నొక్కుతున్నానని వక్కాణిస్తున్న ముఖ్యమంత్రికే బటన్ నొక్కి ఇంట్లో కుక్కుతామన్నారు. సమస్యల పరిస్కారం కోసం జైలుకు వెళ్లడానికి కూడా సిద్ధంగా ఉన్నామన్నారు. పోలీసుల ద్వారా ఉద్యమాన్ని అణచివేయాలని చూస్తే మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

నోటీసులకు బెదిరేది లేదు



ఆటోలో వెళ్తున్న అంగన్‌వాడీలు

అంగన్‌వాడీ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీదేవి మాట్లాడుతూ.. సమస్యల పరిష్కారం కోరుతూ నిరసన తెలుపుతుంటే ప్రభుత్వం హెచ్చరించడం సిగ్గుచేటన్నారు. ఇప్పటికే అంగన్‌వాడీ కేంద్రాల తాళాలు పగులకొట్టి సచివాలయ ఉద్యోగులతో పని చేయిస్తున్నారన్నారు. ఇప్పుడు నోటీసులిస్తామని బెదిరిస్తే తగ్గేది లేదన్నారు. కనీస వేతనం 26 వేలతోపాటు తాము ప్రభుత్వం ముందుంచిన డిమాండ్లు నెరవేర్చే వరకు పోరాటం ఆగదన్నారు. అనంతరం అంగన్‌వాడీల వద్దకు వచ్చిన డీఆర్వో కొండయ్యకు సమస్యలపై వినతి ఇస్తే ప్రభుత్వం దృష్టికి తీసుకెళతానని చెప్పుకొచ్చారు. ఇంతకుముందే అనేక సార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామనీ, అయినా ఏమాత్రం ప్రయోజనం లేదని తెగేసి చెప్పడంతో డీఆర్వో వెనుదిరిగారు. అంగన్‌వాడీ ఉద్యమానికి సీపీఐ జిల్లా కార్యదర్శి వేమయ్యయాద్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఆంజనేయులు, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు జయచంద్రారెడ్డి మద్దతు తెలిపారు.

పోలీసులు అడ్డుకున్నా..



ముసుగు ధరించి..

కలెక్టరేట్ ముట్టడిని భగ్నం చేసేందుకు పోలీసులు అడుగడుగునా అడ్డుకున్నారు. పుట్టపర్తికి బస్సుల్లో వస్తున్న వారిని దించేశారు. అయినా వారు ఖాతరు చేయలేదు. పుట్టపర్తికి 7 కిలోమీటర్ల దూరంలోనే వారిని దించేసినా నడుచుకుంటూ కలెక్టరేట్‌కు చేరుకున్నారు. కొందరైతే మంగళవారం రాత్రికే పుట్టపర్తికి చేరుకున్నారు. చలికి వణుకుతూ రోడ్ల పక్కనే రాత్రంతా ఉండిపోయారు. కొందరు పోలీసులు గుర్తించకుండా మాస్కులు ధరించి వెళ్లారు. ఇంకొందరు ఆటోల్లో కూలీల తరహాలో కలెక్టరేట్‌కు చేరుకున్నారు. అలా.. కలెక్టరేట్‌కు వేలాదిగా చేరుకుని, సత్తాచాటారు. పలుచోట్ల అంగన్‌వాడీలను పోలీసులు అడ్డుకుని, స్టేషన్లకు తరలించారు. సాయంత్రం వదిలిపెట్టారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు వెంకటేష్‌ను పోలీసులు అరెస్టు చేశారు.



ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు వెంకటేష్‌ను అరెస్టు చేసిన పోలీసులు

- బకాయిలు వెంటనే ఇవ్వాలి
- యూటీఎఫ్ నేతల డిమాండ్
- 12 గంటల ధర్నా

1న జీతాలు చెల్లించాలి

పుట్టపర్తి రూరల్, జనవరి 3: ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఒకటో తేదీనే జీతాలు చెల్లించాలనీ, బకాయిలు వెంటనే ఇవ్వాలని యూటీఎఫ్ నేతలు డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోరుతూ యూటీఎఫ్ నేతలు బుధవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయం ఎదుట 12 గంటల ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు జయచంద్రారెడ్డి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి జగన్.. ఎన్నికలకు ముందు ప్రతిపక్ష నాయకుడిగా ఒకటో తేదీన జీతాలు ఇస్తాననీ, క్రమం తప్పకుండా పీఆర్‌సీలు, మెరుగైన డీఏ ఇస్తాననీ, సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ ఇస్తానని హామీలు ఇచ్చారన్నారు. అధికారం చేపట్టిన నాలుగున్నరేళ్లు దాటినా ఏ ఒక్కటీ నెరవేర్చలేదని వాపోయారు. సమస్యలు పరిష్కరించకపోతే జనవరి 9, 10 తేదీల్లో చలో విజయవాడ చేపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో సమగ్రశిక్ష జేఏసీ నేత ఓబిరెడ్డి, సీఐటీయూ నాయకులు జీఎల్ నరసింహులు, ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగార్జున, విద్యార్థి సంఘ నేత సాకే హరి, యూటీఎఫ్ జిల్లా సహాధ్యక్షుడు బాబు, కోశాధికారి శ్రీనివాసులు, జిల్లా కార్యదర్శులు శివ, హరికృష్ణ, జీసీ నరేష్, లక్ష్మీనారాయణ, వైవీ సుబ్బారెడ్డి పాల్గొన్నారు.



ఆర్డీఓ కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న యూటీఎఫ్ నాయకులు

చెత్త తరలింపును అడ్డుకున్న కార్మికులు

వాహనానికి అడ్డంగా పడుకుని నిరసన

కార్మికుల అరెస్టు.. స్టేషన్‌కు తరలింపు

కొనసాగిన సమ్మె

పెనుకొండ, జనవరి 3: సమస్యల పరిష్కారం కోరుతూ పారిశుధ్య కార్మికులు చేపట్టిన సమ్మె బుధవారం 9వ రోజుకు చేరుకుంది. పట్టణంలో చెత్తను తాత్కాలిక కార్మికుల ద్వారా తరలిస్తుండగా.. సమ్మెలో ఉన్న కార్మికులు అడ్డుకున్నారు. చెత్త తరలింపు ట్రాక్టర్‌ను అడ్డుకున్నారు. ముందుకు కదలనీయకుండా అడ్డంగా పడుకున్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు.. నగర పంచాయతీ కార్యాలయం వద్దకు చేరుకుని ట్రాక్టర్‌కు అడ్డంగా పడుకున్న కార్మికులు, సీఐటీయూ నాయకులను అరెస్టు చేసి, స్టేషన్‌కు తరలించారు. అరెస్టులు చేసినా వెనక్కి తగ్గేది లేదనీ, సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె విరమించేది లేదని వారు ఉద్ఘాటించారు.



చెత్త తరలింపు ట్రాక్టర్‌ను అడ్డుకుంటున్న పారిశుధ్య కార్మికులు

ఉద్యోగ భద్రత

కల్పించాలి

సమగ్రశిక్ష ఉద్యోగుల డిమాండ్

కొనసాగిన సమ్మె

బుక్కపట్నం, జనవరి 3: సమగ్రశిక్ష అభియాన్‌లో పనిచేస్తున్న వారికి ఉద్యోగ భద్రత కల్పించి, రెగ్యులర్ చేయాలని ఆ సంఘం జేఏసీ జిల్లా అధ్యక్షుడు ఓబిరెడ్డి డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోరుతూ ఉద్యోగులు చేపట్టిన సమ్మె బుధవారం 15వ రోజుకు చేరుకుంది. బుక్కపట్నంలోని సమగ్రశిక్ష కార్యాలయం ముందు ఉద్యోగులు ధర్నా కొనసాగించారు. ఓబిరెడ్డి మాట్లాడుతూ.. పక్షం రోజులుగా సమ్మె చేపడుతున్నా ప్రభుత్వం స్పందించకపోవడం శోచనీయమన్నారు. సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె విరమించేది లేదని ఉద్ఘాటించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి రామన్న, సమగ్రశిక్ష ఉద్యోగులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న సమగ్రశిక్ష ఉద్యోగులు

అక్కడ ఛీత్కారాలు.. ఇక్కడ పగ్గాలా..?

మధ్యాహ్నం పార్టీలో చేరితే సాయంత్రానికి ఇన్‌చార్జి బాధ్యతలా?

వైసీపీలో రగులుతున్న అసమ్మతి

శాంత సొంత సామాజికవర్గ నేతల్లోనూ ఆగ్రహం

బళ్లారి నేతపై సోషల్ మీడియాలో పోస్టులు

నేడు పురానికి రాక

హిందూపురం, జనవరి 3: వైసీపీలో ఇన్‌చార్జిల మార్పు మంటలు రేపుతోంది. సర్వేలో అనుకూలంగా రాకపోవడంతోనే కొంతమంది సిట్టింగ్ ఎమ్మెల్యేలు, ఎంపీలకు స్థానచలనం కల్పించడంతోపాటు మరికొంత మందికి మొండిచూపు చూపుతున్నట్లు పార్టీ అధిష్ఠానం చెబుతోంది. దీనిపై సిట్టింగ్‌లు, వారి వర్గీయులు, అసమ్మతి నేతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సిట్టింగ్‌లను కాదని ఇతర ప్రాంతాల వారికి అవకాశం ఇవ్వడంపై మండిపడుతున్నారు. వారి సొంత ప్రాంతంలోనే జనం ఛీకొడుతుంటే అలాంటి పిలిచి జిల్లాలో నియోజకవర్గాల పగ్గాలు అప్పగిస్తుండడంపై సిట్టింగ్‌లు ఆగ్రహంతో ఊగిపోతున్నారు. సొంత ప్రాంతంలో వ్యతిరేకత ఎదుర్కొంటున్న వారిని జిల్లాలో ఎలా ఆదరిస్తారంటూ అధిష్ఠానంపై ప్రశ్నలు సంధిస్తున్నారు. వారికి సహకరించేది లేదని చెబుతున్నట్లు సమాచారం.

వైసీపీ అధినేత జగన్మోహన్ రెడ్డి సర్వేలో అనుకూలంగా రాలేదంటూ కొంతమందిని బదిలీల పేరుతో బంతాట ఆడుతుండగా.. మరికొంతమందిని ఇంటిముఖం పట్టించారు. వారి స్థానంలో కొత్తవారిని ఇన్‌చార్జిగా ప్రకటించారు. జిల్లాకు సంబంధంలేని, రాష్ట్రంలోనే నివాసంలేని జే శాంతను మధ్యాహ్నం పార్టీలో చేర్చుకుని.. రాత్రికి ఎంపీ టిక్కెట్టు ప్రకటించడం ఆ పార్టీలో ప్రకంపనలు రేపుతోంది. ఆఖరికి ఆమె సొంత సామాజిక వర్గానికి చెందిన నాయకులు కూడా అధిష్ఠానాన్ని తిట్టిపోస్తున్నారు. ఆమె మొన్నటి వరకు ఆ పార్టీలో లేరు. కర్ణాటకలో ఎప్పుడో 2009లో బీజేపీ తరఫున ఎంపీగా గెలిచారు. అలాంటి నాయకురాలిని హిందూపురానికి ఎంపీ అభ్యర్థిగా ప్రకటించడం, బలవంతంగా పార్టీ నాయకులపై రుద్దడంతో అసమ్మతి సెగలు వెళ్లగక్కుతున్నారు. సిట్టింగ్ ఎంపీ గోరంట్ల మాధవ్, ఆమె సొంత సామాజికవర్గానికి చెందిన నేతలు కూడా వ్యతిరేకిస్తున్నారు. ఆమె కర్ణాటకకు చెందిన మాజీ మంత్రి, బీజేపీ నాయకుడు బళ్లారి శ్రీరాములు సోదరిగానే తెలుసునని సొంత పార్టీ నాయకులు విమర్శలు గుప్పిస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఆమెకు ఇక్కడ ఎంతవరకు ఆదరిస్తారో వేచి చూడాల్సిందే.

అక్కడ ఛీత్కారాలు

కర్ణాటకలో 2009లో బీజేపీ గాలి విపరీతంగా వీచింది. శాంత బీజేపీ తరఫున బళ్లారి ఎంపీగా పోటీ చేసినపుడు ఆ సెగ్మెంట్‌లో పది అసెంబ్లీ నియోజకవర్గాలుండగా.. తొమ్మిదింటిని బీజేపీ కైవసం చేసుకుంది. పార్టీకి అంతటి ఊపు ఉన్నపుడు కూడా శాంత.. సమీప ప్రత్యర్థిపై 3వేల ఓట్లలోపే మెజార్టీతో గెలుపొందడం గమనార్హం. అప్పట్లో బళ్లారి ప్రాంతంలో గాలి జనార్దన్ రెడ్డి హవా ఉండేది. ఆయనతోపాటు బళ్లారి శ్రీరాములు కీలకంగా ఉండేవారు. శాంత బంధువు సురేష్ కూడా ఎమ్మెల్యేగా అప్పట్లో గెలుపొందారు. కుటుంబంలో సోదరుడు శ్రీరాములు, బంధువు సురేష్ గెలుపొందినా.. శాంత మాత్రం 3వేలలోపే మెజార్టీతో సరిపెట్టుకోవాల్సి వచ్చిందంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. ఆ ఎన్నికల్లో అక్కడ ఎస్టీ రిజర్వేషన్ కింద ఆమె పోటీ చేశారు. ఆ తరువాత ఆమె రాజకీయ అవకాశమే లేదు. తటస్థంగా ఉంటూ వస్తున్నారు. గతేడాది కర్ణాటకలో నిర్వహించిన అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసిన శ్రీరాములు బంధువులు ఓటమిపాలయ్యారు. అప్పటి వరకు తిరుగులేని నాయకుడిగా ఉన్న శ్రీరాములుకు కూడా ఓటమి తప్పలేదు. అక్కడ జనం వద్దనుకున్న వారిని ఇక్కడికి తీసుకొచ్చి పగ్గాలు అప్పజెప్పడం ఏమిటన్నది ప్రశ్న.



రగులుతున్న సొంత సామాజికవర్గం

వైసీపీ ఆవిర్భావం నుంచి కష్టపడిన వాల్మీకి నేతలు నియోజకవర్గంలో ఎంతోమంది ఉన్నారు. వారందరినీ కాదని పక్కరాష్ట్రం నుంచి దిగుమతి అయిన నేతకు టిక్కెట్టు ప్రకటించడంపై ఆ పార్టీలోని ఆమె సొంత సామాజికవర్గ నేతలే విస్మయం చెందుతున్నారు. తడాఖా చూపుతామని ప్రకటిస్తున్నారు. ఆమెపై వ్యతిరేకత ఎంతమేర ఎన్నికల్లో పనిచేస్తుందో వేచి చూడాలి.

సోషల్ మీడియాలో పోస్టులు

శాంత హిందూపురం వస్తున్నారని తెలిసి సోషల్ మీడియాలో సొంత సామాజిక వర్గానికి చెందినవారే విమర్శనాస్త్రాలు వదులుతున్నారు. ఆంధ్రప్రదేశ్ వాల్మీకుల ద్రోహి బళ్లారి బీజేపీ నాయకుడు శ్రీరాములు అనీ, అలాంటి నేత తన సోదరిని ఇక్కడకు పంపడం ఏంటని సోషల్‌మీడియా వేదికగా ప్రశ్నిస్తున్నారు. ఇక్కడి వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చకుండా మాయమాటలు చెప్పి మోసం చేసిన వ్యక్తి శ్రీరాములు అనీ, అలాంటి వారికి వాల్మీకులు సహకరించకూడదని ప్రకటన కూడా విడుదల చేశారు. 2016లో హిందూపురంలో వాల్మీకి కల్యాణమండపం ప్రారంభోత్సవానికి ఆయన వచ్చినపుడు ఇక్కడి వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చేందుకు ప్రధానితో మాట్లాడి పార్లమెంటులో ఆమోదం పొందేలా చేస్తానని హామీ ఇచ్చారు. ఆ హామీ అటకెక్కింది. కళ్యాణదుర్గంలో ఎస్టీ జాబితా కోసం చేపట్టిన రథయాత్ర ప్రారంభానికి వస్తానని చెప్పి మొహం చాటేసిన శ్రీరాములు.. ఈరోజు సోదరిని ఇక్కడికి పంపడం సిగ్గుచేటని వాల్మీకి నేతలు మండిపడుతున్నారు. శాంతపై సోషల్ మీడియాలో వాల్మీకులు పెద్దఎత్తున వ్యతిరేకత వ్యక్తం చేస్తున్నారు.

నేడు పురానికి రాక



తాడేపల్లిలో మంగళవారం మధ్యాహ్నం వైసీపీ తీర్థం పుచ్చుకుని, రాత్రికి హిందూపురం పార్లమెంటు ఇన్‌చార్జిగా ప్రకటించుకుని బుధవారం మంత్రి పెద్దిరెడ్డిని శాంత కలిశారు. ఆమె బుధవారం హిందూపురానికి రానున్నట్లు వైసీపీలోని ఓ వర్గం నాయకులు పేర్కొంటున్నారు. ఇప్పటికే ఆమె రాక సందర్భంగా ప్రధాన రహదారిలోని వైసీపీ నాయకుడి ఇంటిని సిద్ధం చేసినట్లు తెలిసింది. త్వరలోనే ఇక్కడ వైసీపీ పార్లమెంటు నియోజకవర్గ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్నట్లు సమాచారం. ఆమె రాకకోసం ఏర్పాట్లను వైసీపీలోని ఓ వర్గం నాయకులు చూస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం.

పుట్టపర్తి వైసీపీలో ముసలం

దుద్దుకుంటకు టిక్కెట్టు ఇస్తే ఓటమే..

పార్టీ ఏకపక్ష నిర్ణయం తీసుకుంటే వేరుకుంపటే..

లోచర్ల విజయభాస్కర్ రెడ్డి హెచ్చరిక



పుట్టపర్తి, జనవరి3(ఆంధ్రజ్యోతి): జిల్లాలో అధికార పార్టీలో మార్పుల మంటలు చల్లారకనే పుట్టపర్తి వైసీపీలో ముసలం మొదలైంది. సిట్టింగ్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డికి టిక్కెట్టు ఇస్తే సహకరించే ప్రసక్తి లేదనీ, అసమ్మతి నేతలు గళం విప్పారు. రాష్ట్రంలో వచ్చే ఎన్నికలకు అభ్యర్థుల ఎంపికలో దిద్దుబాటు పేరుతో వైసీపీ అధిష్ఠానం ఎంపీలు, సిట్టింగ్ ఎమ్మెల్యేల మార్పులు అంటూ హడావుడి చేస్తోంది. రెండో విడతలో జిల్లాల్లో హిందూపురం ఎంపీ గోరంట్ల మాధవ్‌తోపాటు కదిరి ఎమ్మెల్యే సిద్దారెడ్డిపై వేటువేయగా.. పెనుకొండ సిట్టింగ్ ఎమ్మెల్యే శంకరనారాయణను అనంత ఎంపీగా సాగనంపారు. బళ్లారికి చెందిన బీజేపీ మాజీ ఎంపీ శాంతను హిందూపురం ఎంపీ అభ్యర్థిగా ఎంపిక చేశారు. సిట్టింగ్ ఎమ్మెల్యేలను మార్చవద్దంటూ కదిరి, పెనుకొండలో పార్టీ శ్రేణుల అధిష్ఠానానికి హెచ్చరికలు చేస్తూ రాజీనామాల అస్త్రం ప్రయోగించాయి. అయినా అధిష్ఠానం హిందూపురం ఎంపీ, పెనుకొండ, కదిరి సిట్టింగ్‌లను మార్చేసింది. ఆ వేడి చల్లారకనే పుట్టపర్తి సిట్టింగ్ ఎమ్మెల్యేపై లుకలుకలు బయటపడ్డాయి. వారం కిందట పాముదుర్తిలో ఎమ్మెల్యే వ్యతిరేక వర్గ నేతలు పాముదుర్తి ఇంద్రజిత్‌రెడ్డి, సీఈసీ సభ్యుడు సోమశేఖర్‌రెడ్డి భేటీ అయ్యారు. శ్రీధర్‌రెడ్డిపై తిరుగుబావుటా ఎగురవేశారు. తాజాగా ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డికి మళ్లీ అవకాశం ఇవ్వద్దని వైసీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి లోచర్ల విజయభాస్కర్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. బుధవారం పుట్టపర్తిలోని ప్రశాంతి గ్రామంలో ఆయన మాట్లాడుతూ.. ఎమ్మెల్యే దుద్దకుంటపై ఫైర్ అయ్యారు. శ్రీధర్‌రెడ్డి ఐదేళ్లలో నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి ఏమీ లేదనీ, పార్టీ జెండా మోసిన కార్యకర్తలను ఏనాడూ పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. చాలా సర్వేల్లో వచ్చే ఎన్నికల్లో శ్రీధర్‌రెడ్డికి ఇస్తే గెలిచేదిలేదని తేలిందని ఆయన తెలిపారు. ఎమ్మెల్యే మాత్రం తనకే టిక్కెట్టు అనీ, భారీ మెజార్టీతో గెలుస్తానని అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నాడనీ, ఆ అవకాశమే లోచర్ల పేర్కొన్నారు. శ్రీధర్‌రెడ్డి గెలిచే ప్రసక్తేలేదన్నారు. నియోజకవర్గంలో నలుగురైదుగురు నేతలు పోటీకి సిద్ధంగా ఉన్నారనీ, శ్రీధర్‌రెడ్డిని పక్కన పెట్టి బలమైన వారిని ఎంపిక చేయడంపై అధిష్ఠానం ఆలోచన చేయాలన్నారు. జిల్లాలో సిట్టింగ్ ఎమ్మెల్యేలు కావాలంటూ పార్టీ శ్రేణులు రాజీనామాలు చేస్తుంటే పుట్టపర్తిలో మాత్రం ఎమ్మెల్యే తమకొద్దంటూ బహిరంగంగా చెబుతున్నారన్నారు. ఎక్కడెక్కడోళ్లనో తీసుకొచ్చి ఎమ్మెల్యే ఎంపీ అభ్యర్థులుగా ప్రకటిస్తున్నారే తప్ప.. ఏనాడూ నాయకులు, కార్యకర్తల మనోభీష్టం అధిష్ఠానం వద్ద చెప్పుకునే పరిస్థితి లేదన్నారు. ఏకపక్ష నిర్ణయాలు తీసుకోవడం సరికాదనీ, మళ్లీ దుద్దుకుంటకు అవకాశం ఇస్తే తమ దారి తాము చూసుకుంటామని ప్రకటించారు. లోచర్ల విజయభాస్కర్ రెడ్డి అసమ్మతి గళం విప్పడంతో ఎమ్మెల్యేకి టిక్కెట్టు ఇవ్వద్దంటూ ఒకే వేదికపైకి అసమ్మతి నేతలు వచ్చి, సమావేశం పెట్టేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. పుట్టపర్తి టిక్కెట్టు కోసం ఐదుగురు ప్రయత్నాలు చేస్తున్నారు. రెండో జాబితాలో పుట్టపర్తి సిట్టింగ్ ఎమ్మెల్యే పేరులేకపోవడంతో వైసీపీలో లోలోపలే అన్న అసమ్మతి బహిర్గమౌతోంది. ఈ పరిణామాల నేపథ్యంలో పార్టీ కార్యకర్తల్లో అయోమయం నెలకొంది.

మంగమ్మ ధిక్కార స్వరం..!

మార్పుచేర్పులను పట్టించుకోవద్దంటూ హితవు

శంకర్ నారాయణకు మంచి చేకూరుతుందని ఆశాభావం



హిందూపురం, జనవరి 3: వైసీపీ అధిష్ఠానం తీసుకున్న నిర్ణయంపై ఆ పార్టీ ఎమ్మెల్సీ మంగమ్మ ధిక్కారస్వరం వినిపించారు. బుధవారం గోరంట్లలో పంచాయతీ నిధులతో నిర్మించిన నూతన కాంప్లెక్స్ ప్రారంభోత్సవంలో పెనుకొండ ఎమ్మెల్యే శంకర్‌నారాయణతో కలిసి ఎమ్మెల్సీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మంగమ్మ.. వైసీపీ అధిష్ఠానం ప్రకటించిన ఇన్‌చార్జిల జాబితాపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. వైసీపీ అభ్యర్థుల మార్పుచేర్పులను ఎవరూ పట్టించుకోవద్దన్నారు. ఇంకా ఎన్నో మార్పుచేర్పులు ఉంటాయనీ, పెనుకొండ నియోజకవర్గ ప్రజలు నిరుత్సాహపడవద్దన్నారు. శంకర్‌నారాయణకు అంతా మంచే చేకూరుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. పెనుకొండ నియోజకవర్గాన్ని ఎమ్మెల్యే ఎంతో అభివృద్ధి చేశారని చెప్పుకొచ్చారు. అందరికీ అందుబాటులో ఉండే నాయకుడు శంకరన్న అని పేర్కొన్నారు. ఇదే వేదికపై ఎమ్మెల్యే శంకర్‌నారాయణ మాట్లాడుతూ.. పెనుకొండను అన్నివిధాలా అభివృద్ధి చేశామనీ, ఈ కారణంగానే నియోజకవర్గం కోసం ఎందరో పోటీపడ్డారన్నారు. ఎమ్మెల్సీ మంగమ్మ వ్యాఖ్యలు అధికార పార్టీలో దుమారం రేపాయి. పార్టీలో నెలకొన్న అసమ్మతికి ఆజ్యం పోసేలా ఉన్నాయని ఆ వర్గాలు పేర్కొంటున్నాయి.

ఎన్నికల ఏర్పాట్లపై కలెక్టర్ పరిశీలన


ఎన్నికల ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టరు గౌతమి

అనంతపురం టౌన్ జనవరి 3: ఎన్నికలు దగ్గరపడుతుండటంతో ఏర్పాట్లను కలెక్టర్ గౌతమి బుధవారం పరిశీలించారు. జిల్లాలోని 8 అసెంబ్లీ నియోజకవర్గాలు, ఒక పార్లమెంటు స్థానానికి సంబంధించి ఎన్నికల ఏర్పాట్లను జేఎన్‌టీయులో నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో కలెక్టరు అధికారులతో కలిసి ఏర్పాట్లపై జేఎన్‌టీయులో పరిశీలించారు. స్ట్రాంగ్‌రూమ్స్, కౌంటింగ్ కేంద్రాలు, రిసెప్షన్ కౌంటర్లు ఎక్కడెక్కడ ఏర్పాటు చేయాలి..? ఎన్ని గదులు అవసరమవుతాయి..? తదితర విషయాలపై ఆరా తీశారు. ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. కలెక్టర్ వెంట జేసీ కేతన్‌గార్గ్, డీఆర్‌ఓ గాయిత్రీదేవి. ఆర్డీఓలు గ్రంధి వెంకటేష్, శ్రీనివాసరెడ్డి, నగరపాలక కమిషనర్ భాగ్యలక్ష్మీ, ఎన్నికల విభాగం అధికారులు భాస్కర్, కనకరాజు ఉన్నారు.

నార్పలలో ఒకరికి కరోనా

అనంతపురం టౌన్ జనవరి 3: మండల కేంద్రమైన నార్పలలో ఒకరికి కరోనా పాజిటివ్ వచ్చింది. బుధవారం జిల్లా ఆసుపత్రికి సంబంధిత లక్షణాలతో వచ్చిన 25 మంది శ్యాంపిల్స్‌ను ల్యాబ్‌కు పంపించారు. ఇందులో నార్పలకు చెందిన 35 సంవత్సరాల యువకుడికి కరోనా నిర్ధారణ అయ్యింది. ఈ విషయాన్ని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ విషయాన్ని డీఎంహెచ్‌ఓకు తెలియజేశామన్నారు. నార్పల వైద్య సిబ్బందిని అప్రమత్తం చేసినట్లు డీఎంహెచ్‌ఓ తెలిపారు. పాజిటివ్ వచ్చిన వ్యక్తిని పరిశీలించారని, అతను ఆరోగ్యంగా ఉన్నాడన్నారు. అయినా అవసరమైన మందులు ఇచ్చి హోంఐసోలేషన్‌లో ఉండాల్సిందిగా సూచించామన్నారు. ఆ యువకుడి కుటుంబ సభ్యులను పరీక్షించడం జరుగుతుందన్నారు. కాగా గతంలో నమోదైన మూడు కరోనా కేసులకు సంబంధించి ఒక వ్యక్తి జిల్లా ఆసుపత్రిలో చికిత్స తీసుకుని డిశ్చార్జి అయ్యాడన్నారు. మిగిలిన ఇద్దరూ హోంఐసోలేషన్‌లో ఉంటూ చికిత్స తీసుకున్నారని, ప్రస్తుతం వీరు ఆరోగ్యంగా ఉన్నారన్నారు.

అప్పుల బాధతో చేనేత కార్మికుడి ఆత్మహత్య


శ్రీనివాసులు (ఫైల్)

ధర్మవరం, జనవరి 3: పట్టణంలోని కేశవనగర్‌లో అప్పుల బాధ భరించలేక చేనేత కార్మికుడు వనం శ్రీనివాసులు (47) బుధవారం ఆత్మహత్య చేసుకున్నాడు. వన్‌టౌన్ పోలీసులు, బంధువులు తెలిపిన వివరాల మేరకు... కేశవనగర్‌కు చెందిన శ్రీనివాసులు కూలిమగ్గం నేస్తుండేవాడు. నేసిన చీరకు గిట్టుబాటు ధర లభించక కుటుంబ పోషణ భారమైంది. రూ.5లక్షలదాకా అప్పులు చేశాడు. మగ్గం నేస్తే అప్పులు తీర్చలేనని భావించి 8 నెలల క్రితం హోటల్లోకి పనికెళ్లాడు. ఆరోగ్యం సహకరించక వదిలేశాడు. అప్పులు ఎలాతీర్చాలోనని ఆవేదన చెందుతుండేవాడు. ఈ నేపథ్యంలో తీవ్ర మనస్తాపం చెంది బుధవారం మధ్యాహ్నం ఇంట్లో ఉరేసుకుని, మరణించాడు. ఆస్పత్రికి వెళ్లిన అతడి తల్లి వనం శేషమ్మ ఇంటికి తిరిగొచ్చి చూడగా కొడుకు ఉరికి వేలాడుతూ కనిపించాడు. దీంతో తల్లి బోరున విలపించింది. చుట్టుపక్కల వారు వచ్చి శ్రీనివాసులు మృతదేహాన్ని కిందకు దించి, పోలీసులకు సమాచారం అందించారు. అతడి తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని, శవాన్ని స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. శ్రీనివాసులుకు భార్య భాగ్యమ్మ, కుమార్తె రోజా ఉన్నారు. కుమార్తెకు వివాహమైంది. భార్య మూడేళ్లక్రితం విడాకులు ఇచ్చింది. ఈ నేపథ్యంలో శ్రీనివాసులు.. తల్లి వద్దనే ఉంటుండేవాడు.

పాత భవనాల పరిశీలన

గుత్తి, జనవరి 3: గుత్తి రైల్వేస్టేషన్ అభివృద్ధిలో భాగంగా పలు పాత భవనాలను గుంతకల్లు సీనియర్ డీపీఓ జేఎస్ చౌహాన్, సీనియర్ డీఈఎన్ సంజీవ్‌రావు బుధవారం పరిశీలించారు. ఆర్గనైజేషన్, వ్యాయామ భవనంతోపాటు పలు శిథిలావస్థలో ఉన్న వాటిని చూశారు. రైల్వే ఇనిస్టిట్యూట్, కమ్యూనిటీ హాల్‌ను పరిశీలించారు. వారి వెంట ఏడీఈఎన్ ప్రభాకర్, ఎస్ఎస్ వర్క్ నగేష్‌నాయక్ ఉన్నారు.

రెండు దుకాణాల్లో చోరీ

ధర్మవరం, జనవరి 3: పట్టణంలోని ప్రియాంకనగర్ ప్రధాన రహదారి పక్కనున్న రెండు దుకాణాల్లో మంగళవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు ప్రియాంకనగర్ ప్రధాన రహదారి పక్కన ఉన్న లక్ష్మీనారాయణ ఎంటర్‌ప్రైజస్ దుకాణంపై ఉన్న రేకులను తొలగించి రూ.60వేలు నగదు, రూ.1.50లక్ష విలువ చేసే కరెంటు వైర్లు, రూ.50వేలు విలువ చేసే ఫ్యాన్లు, గీజర్లను గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. అదేవిధంగా పక్కనే ఉన్న మొబైల్ షాపు రేకులను తొలగించి కంప్యూటర్, నాలుగు మొబైల్ ఫోన్లు, సామగ్రితోపాటు దాదాపు రూ.40వేలు చోరీ చేశారు. ఉదయం ఆయా దుకాణాల యజమానులు నరేశ్‌రెడ్డి, రామ్‌కుమార్‌ల చోరీ జరిగినట్టు గమనించి పోలీసులకు ఫిర్యాదుచేశారు. పోలీసులు సంఘటనాస్థలాలను పరిశీలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నీరివ్వకపోతే నాయకులను నిర్బంధిస్తాం

హంద్రీనీవా కార్యాలయం ఎదుట ధర్నాలో సీపీఐ నాయకులు



హంద్రీనీవా కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు, రైతులు

అనంతపురం క్లాక్‌టవర్, జనవరి 3: హంద్రీనీవాను నమ్ముకుని పంటలు సాగు చేశాం.. ఎండిపోతున్న పంటలకు వారంలోపు నీరివ్వకపోతే జిల్లాలోని అధికారపార్టీ నాయకులను ఎక్కడికక్కడ నిర్బంధిస్తామని వైసీపీ ప్రభుత్వానికి రైతుల తరపున సీపీఐ నేతలు అల్టిమేటం జారీ చేశారు. హంద్రీనీవా కింద సాగు చేసిన పంటలకు సాగునీరు ఇవ్వాలని, సీఎల్‌డీఐ ప్రాజెక్ట్ పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం స్థానిక హెచ్చెల్సీ కాలనీలోని హంద్రీనీవా కార్యాలయం ఎదుట రైతులతో కలిసి సీపీఐ నాయకులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్ మాట్లాడుతూ రైతులను దగా చేసిన సీఎం జగన్‌కు రోజులు దగ్గరపడ్డాయన్నారు. అన్నదాతలను నిర్లక్ష్యం చేస్తే ఉసురు తప్పదని హెచ్చరించారు. నాలుగున్నరేళ్ళుగా జిల్లాలో ఇరిగేషన్ ప్రాజెక్ట్‌లకు పైసా ఇవ్వకుండా వైసీపీ ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని మండిపడ్డారు. కరవును దృష్టిలో ఉంచుకుని రైతులను ఆదుకోవడం కనీస బాధ్యతని, దానిని కూడా సీఎం విస్మరించారన్నారు. ఎన్నికల నేపథ్యంలో సీట్లు అమ్ముకోవడంపై దృష్టి పెట్టడం దారుణమన్నారు. వెంటనే హంద్రీనీవా నీటిని జీబీసీతో పాటు రిజర్వాయర్లు, చెరువులకు, ఆయకట్టుకు వారం రోజుల్లో అందించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎస్ఈ కార్యాలయంలోకి వెళ్లి నాయకులు వినతిపత్రం అందజేశారు. ఎస్ఈ దేశేనాయక్ స్పందిస్తూ రైతుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి జీబీసీకి సాగునీరు అందజేసి పంటలను కాపాడుతామన్నారు. సీఎల్‌డీపీని పూర్తిచేసేలా చర్యలు తీసుకుంటామని సమాధానమిచ్చారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శులు పి నారాయణస్వామి, మల్లికార్జున, నగర కార్యదర్శి శ్రీరాములు, ఏపీ వ్యవసాయ కార్మికసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కేశవరెడ్డి, నాయకులు నారాయణస్వామి, రామకృష్ణ, రమేష్, అల్లీపీరా, రమణయ్య, మనోహర్, వెంకటనారాయణ, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరం కోసం ప్రత్యేక మేనిఫెస్టో


శివాలయంలో పూజలు చేయిస్తున్న పరిటాల శ్రీరామ్


సమస్యలు తెలుసుకుంటూ...

ప్రతివార్డులో సమస్యలను తెలుసుకుంటాం

అధికారంలోకి రాగానే పరిష్కరిస్తాం

పాదయాత్రలో పరిటాల శ్రీరామ్

ధర్మవరం, జనవరి 3: ప్రత్యేకంగా ఓ మేనిఫెస్టోను ధర్మవరం కోసం రూపొందిస్తున్నట్టు టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరిటాలశ్రీరామ్ పేర్కొన్నారు. పట్టణంలో బుధవారం ఐదురోజుల పాదయాత్రకు శ్రీకారంచుట్టారు. శివానగర్‌లోని శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి 7వ వార్డు నుంచి పాదయాత్రను ప్రారంభించారు. స్థానిక నాయకులతో బాబుష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానికులతో మాట్లాడుతూ మినీమేనిఫెస్టోలోని అంశాలను వివరించారు. కాలనీల్లో నెలకొన్న సమస్యలను తెలుసుకున్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే సమస్యలను పరిష్కరిస్తామన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చంద్రబాబునాయుడు అన్ని వర్గాలను దృష్టిలో ఉంచుకుని మినీ మేనిఫెస్టోను రూపొందించారన్నారు. అదేస్ఫూర్తితో స్థానికంగా ఉన్న సమస్యలను తెలుసుకుని ప్రత్యేక మేనిఫెస్టోను రూపొందిస్తున్నట్లు పేర్కొన్నారు. గురువారం ఉదయం 9 గంటలకు గుట్టకిందపల్లిసెంటర్ నుంచి పాదయాత్ర ప్రారంభమవుతుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు గోనుగుంట్ల విజయ్‌కుమార్, కమతంకాటమయ్య, ఫణికుమార్, పల్లపు రవీంద్ర, పల్లపు శివశంకర్, పురుషోత్తంగౌడ్, పరిశేసుధాకర్, నాగూర్‌హుస్సేన్, రాళ్లపల్లిషరీఫ్, అత్తర్ రహింబాషా, గోసలశ్రీరాములు, కేశగాళ్లశీన, బొట్టుకిష్ట, మహేశ్, ఇర్షాద్ తదితరులు పాల్గొన్నారు.

23 నుంచి అనంతలో లఘుచిత్ర వారోత్సవాలు


లఘుచిత్ర వారోత్సవాల పోస్టర్లు ఆవిష్కరిస్తున్న దృశ్యం

అనంతపురం కల్చరల్, జనవరి 3: అనంతపురం ఫిల్మ్ సొసైటీ ఆధ్వర్యంలో ఈనెల 23 నుంచి 28వ తేదీ వరకు జిల్లా కేంద్రంలో 6వ అనంత లఘుచిత్ర వారోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆ సొసైటీ అధ్యక్షుడు రషీద్‌బాషా తెలిపారు. బుధవారం ఎస్ఎస్ ప్యారడైజ్ కాన్ఫరెన్స్ హాల్‌లో ఇందుకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నగరంలోని విద్యుత్ కళావేదిక ఆవరణలోని మినీ థియేటర్‌లో వారోత్సవాల ప్రారంభోత్సవం ఉంటుందన్నారు. 26, 27వ తేదీల్లో దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన ఔత్సాహికులు రూపొందించిన లఘుచిత్రాల ప్రదర్శన, మొబైల్ ఫిల్మ్ మేకింగ్ లఘుచిత్రాల ప్రదర్శన ఉంటుందన్నారు. 28న ఉత్తమ లఘుచిత్రాలకు అవార్డుల ప్రదానోత్సవం ఉంటుందని పేర్కొన్నారు. జాతీయ సంప్రదాయ కళలు, వారసత్వ సంపదలపై సెల్‌ఫోన్ ద్వారా నిర్మించిన షార్ట్స్, రీల్స్, లఘుచిత్రాలకు రూ.5వేలు, కవర్‌సాంగ్‌లు రూపొందించిన నృత్య దర్శకులకు రూ.3వేలు, రూ.2వేల చొప్పున ఇద్దరికి నగదు అందజేస్తామని వివరించారు. షార్ట్ ఫిల్మ్ విభాగంలో మొదటిస్థానంలో నిలిచిన విజేతకు రూ.5వేలు, ద్వితీయ స్థానానికి రూ.3వేలు, తృతీయ బహుమతి కింద రూ.2వేలు అందించనున్నామన్నారు. పోటీదారులకు ప్రోత్సాహక నగదు పురస్కారాలు, మొమెంటో, సర్టిఫికెట్ల ప్రదానం ఉంటుందన్నారు. లఘుచిత్ర వారోత్సవాల్లో పాల్గొనదలచిన వారు తమ లఘుచిత్రాలు, షార్ట్స్ రీల్స్ యూట్యూబ్ లింకులను ఈనెల 20వ తేదీలోపు 9676350681 నెంబర్‌కు వాట్సాప్ ద్వారా పంపాలన్నారు. మరిన్ని వివరాలకు 6302746071 నెంబర్‌ను సంప్రదించవచ్చునన్నారు. కార్యక్రమంలో కంబదూరి షేక్ నబిరసూల్, తోట బాలన్న, హొన్నూరప్ప, రాఘవేంద్ర, మురళీధర్‌రావు తదితరులు పాల్గొన్నారు.


కళ్యాణదుర్గంలో ప్లేట్లలో ఆకులు పెట్టుకుని తింటూ.. మోకాళ్లపై కూర్చుని నిరసన చేపట్టిన కార్మికులు

సమ్మెలో 'శ్రీరామిరెడ్డి కార్మికులు'

325 గ్రామాలకు ఆగిన నీటి సరఫరా

కళ్యాణదుర్గం, జనవరి 3: శ్రీరామిరెడ్డి నీటి పథకం కార్మికులు సమ్మెబాట పట్టారు. పంప్‌హౌస్‌కు తాళాలు వేసి, ప్లేట్లలో ఆకులు పెట్టుకుని, మోకాళ్లపై కూర్చుని బుధవారం వినూత్నంగా నిరసన చేపట్టారు. ఫేజ్-4 కింద ఉన్న కళ్యాణదుర్గం, రాయదుర్గం నియోజకవర్గాల్లో 225 మంది కార్మికులు ఈ సమ్మెలో పాల్గొన్నారు. ఈ సమ్మె ప్రభావంతో సుమారు 325 గ్రామాలకు తాగునీటి సరఫరా ఆగిపోయింది. గత 15 ఏళ్లుగా ఈ పథకంలో కార్మికులుగా పనిచేస్తున్నామని నెలనెలా జీతాలు, ఇతరత్రా ప్రయోజనాలు కల్పించడంలో అధికారులు, కాంట్రాక్టర్లు నిర్లక్ష్యం చేస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఐదు నెలలుగా జీతాలు ఇవ్వకపోతే కుటుంబాలను ఎలా పోషించుకోవాలన్నారు. మూడు రోజులుగా అక్కడే ఉంటూ వంటా వార్పు చేస్తూ, వినూత్న నిరసనలు చేస్తున్నారు. సమస్య పరిష్కారం అయ్యేంత వరకు సమ్మెను విరమించేది లేదన్నారు. ఈ సమ్మెను ఇంకా ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

కణేకల్లులో..


కణేకల్లులో అర్ధనగ్న ప్రదర్శన చేస్తున్న కార్మికులు

కణేకల్లు: శ్రీరామిరెడ్డి తాగునీటి పథకంలో పనిచేస్తున్న కార్మికుల సమ్మె మూడో రోజు కొనసాగింది. మండలంలోని ఆలూరులో ఉన్న పంప్‌హౌస్ వద్ద కార్మికులు అర్ధనగ్న ప్రదర్శన చేసి తమ నిరసనను తెలియజేశారు.

బకాయిలు చెల్లించాలి

కలెక్టరేట్ వద్ద ధర్నాలో యూటీఎఫ్ నాయకులు

అనంతపురం విద్య, జనవరి 3: ఉద్యోగ, ఉపాధ్యాయులకు పెండింగ్ ఉన్న బకాయిలను వెంటనే చెల్లించాలని వక్తలు, యూటీఎఫ్ నాయకులు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం కలెక్టరేట్ వద్ద యూటీఎఫ్ నాయకులు 12 గంటల ధర్నా నిర్వహించారు. ధర్నాకు మాజీ ఎమ్మెల్సీ గేయానంద్ హాజరై మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర సంపద రూ.15 లక్షల కోట్లు ఉన్నప్పటికీ ఉద్యోగ, ఉపాధ్యాయులకు సకాలంలో జీతాలు చెల్లించలేని పరిస్థితి ఈ ప్రభుత్వంలో ఏర్పడటం శోచనీయమన్నారు. ఆదాయ వనరులను కార్పొరేట్లకు కట్టబెడుతూ రాష్ట్ర ప్రజలు, ఉద్యోగ, ఉపాధ్యాయులను అనేక ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. 15 తేదీ వరకూ జీతాలు జమ చేయలేని పరిస్థితులు రాష్ట్రంలో ఈ ప్రభుత్వం వల్ల ఏర్పడ్డాయన్నారు. సకాలంలో జీతాలు పడక రుణాలు తీసుకున్న ఉపాధ్యాయులు, ఉద్యోగులు లోన్స్ ఈఎంఐలు సకాలంలో చెల్లించకలేక ఫైన్లు కడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కోటేశ్వరరావు, డాక్టర్ ప్రసూన, ఐద్వా నాయకురాలు సావిత్రి, రామాంజినమ్మ మాట్లాడుతూ ఉద్యోగులకు పెండింగ్‌లో డీఏలు, పీఆర్సీ అరియర్ బకాయిలు వెంటనే చెల్లించాలన్నారు. లేనిపక్షంలో ఈనెల 9,10 తేదీల్లో విజయవాడలో 36 గంటలు ధర్నా చేపడుతామన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు గోవిందరాజులు, ప్రధానకార్యదర్శి లింగమయ్య, సీపీఎం రాంభూపాల్, ఇతర నేతలు రమణయ్య, సుధాకర్, రామప్ప, రాఘవేంద్ర, దేవేంద్రమ్మ, ఈశ్వరయ్య, మహమ్మద్ జిలాన్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న గేయానంద్

స్నేహితులు హేళన చేశారని విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

నార్పల, జనవరి 3: మండల కేంద్రంలోని కేజీబీవీలో స్నేహితులు హేళన చేశారని విద్యార్థిని అశ్విని బుధవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. వివరాల్లోకి వెళితే... మండలంలోని హెచ్ సోదనపల్లి గ్రామానికి చెందిన అశ్విని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో తొమ్మిదవ తరగతి చదువుతోంది. పాఠశాలలోని తోటి స్నేహితులు అశ్వినిని అసభ్యంగా మాట్లాడమే కాకుండా హేళన చేశారు. దీంతో తీవ్ర మనస్థాపానికి గురైన బాలిక విషం సేవించి అపస్మారక స్థితిలో పడిపోయింది. తోటి విద్యార్థినులు గమనించి వెంటనే ఉపాధ్యాయులకు తెలియజేశారు. వారు ఆ బాలికను అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం బాలిక పరిస్థితి నిలకడగా ఉన్నట్లు తెలిసింది. కాగా ఎమ్మార్పీఎస్, కమ్యూనిస్టు నాయకులు కస్తూర్బా బాలికల పాఠశాల ముందు ధర్నా చేపట్టారు. బాలిక ఆత్మహత్యాయత్నానికి గల కారణాలు గుర్తించి, బాధ్యులను శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనపై ఎస్ఓ నిర్మలను వివరణ కోరేందుకు ప్రయత్నించగా ఆమె ఫోను అందుబాటులోకి రాలేదు.

వైసీపీ నుంచి 150 కుటుంబాలు టీడీపీలోకి..



టీడీపీలో చేరిన వారితో కందికుంట వెంకటప్రసాద్

కదిరి, జనవరి 3: తలుపుల మండలం ఈదులకుంట్ల పల్లి, మంగివాండ్లపల్లి, మడుగుతండా, చంద్రే నాయక్ తండా తదితర గ్రామాల నుంచి దాదాపు 150 కుటుంబాల వారు వైసీపీని వీడి టీడీపీలోకి చేరారు. తలుపుల మండలకేంద్రంలో బుధవారం వారందరూ నియోజకవర్గ ఇన్‌చార్జి కందికుంట వెంకటప్రసాద్ సమక్షంలో చేరారు. కందికుంట వారికి కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో టీడీపీ విజయానికి ప్రతిఒక్కరూ సైనికుల్లా కృషి చేయాలని సూచించారు. చేరిన వారిలో ఈదుకుంట్లపల్లి వైసీపీ సర్పంచ్ కుమారిబాయి, దేవేంద్రనాయక్‌తో పాటు పలువురు ఉన్నారు. కార్యక్రమంలో నాయకులు మేడా శంకర్, ఓబులరెడ్డి, విశ్వనాథ్‌రెడ్డి, రాజారెడ్డి, జయచంద్ర, శ్రీనివాసులు, నారాయణరెడ్డి, రఘునాథ్‌రెడ్డి, బాబ్‌జాన్ తదితరులు ఉన్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు ప్రభుత్వానికి పట్టవా?



ధర్మవరం మున్సిపల్ కార్యాలయం వద్ద కార్మికుల నిరసన

ధర్మవరం, జనవరి 3: మున్సిపల్ కార్మికుల సమస్యలు ప్రభుత్వానికి పట్టవా అంటూ సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు నాగభూషణం ప్రశ్నించారు. తమ సమస్యల పరిష్కారం కోరుతూ మున్సిపల్ పారిశుధ్య, ఇంజనీరింగ్ కార్మికులు చేపట్టిన సమ్మె బుధవారం నాటికి 9వ రోజుకు చేరింది. ఈ సమ్మెకు నాగభూషణం సంఘీభావం తెలిపి మాట్లాడారు. కార్మికులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్,పెన్షన్ సౌకర్యం కల్పించాలని, ఇంజనీరింగ్ కార్మికులకు హెల్త్, రిస్క్ అలవెన్సులు చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్మికసంఘం గౌరవసలహాదారులు పెద్దక్క, వెంకటేశులు, సెక్రటరీ చెన్నకేశవులు, కోశాధికారి లక్ష్మీఓబులేశు, ఉపాధ్యక్షుడు ప్రసాద్, జాయింట్ సెక్రెటరీ ముకుంద, ఔట్‌సోర్సింగ్ఇంజనీరింగ్ విభాగపుఉద్యోగ కార్మికసంఘం అధ్యక్షుడు అడ్రామహేశ్, ప్రధానకార్యదర్శి బొగ్గునాగరాజు, సహాయకార్యదర్శి సాకే బాబు, కోశాధికారి అనిల్‌కుమార్, ఉపాధ్యక్షుడు దాసరిసురేశ్ తదితరులు పాల్గొన్నారు.

పుట్టపర్తి: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద కార్మికులు సమ్మె కొనసాగించారు.. ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమ్మెకు సీఐటీయూ నాయకులు లక్ష్మీనారాయణ, గంగాధర్, బాబావలి మద్దతు పలికారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు పెద్దన్న, నరసింహులు, నాగార్జున, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరు



బుక్కపట్నంలో అరెస్టు అయిన అంగన్‌వాడీలు , సీఐటీయూ నాయకులు



కదిరి పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌లో అంగన్‌వాడీలు

- అంగన్‌వాడీల ఆగ్రహం
- చలో కలెక్టరేట్‌కు వెళ్లనీయకుండా అరెస్టు చేసిన పోలీసులు

బుక్కపట్నం, జనవరి 3: అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని అంగన్‌వాడీ కార్యకర్తలు ఆగ్రహించారు. మండలంలోని అంగన్‌వాడీలు బుధవారం జిల్లాకేంద్రంలో జరిగే చలో కలెక్టరేట్‌కు వెళ్తుండగా.. పోలీసులు అడ్డుకుని అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అలాగే సీఐటీయూ జిల్లా కార్యదర్శి వెంకటేష్, నాయకులను కూడా ముందస్తు అరెస్టు చేశారు. దీంతో వారు పోలీస్ స్టేషన్‌లో నిరసన తెలిపారు. అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తోందన్నారు. సమస్యలు పరిష్కరించకపోతే ప్రభుత్వానికి అంగన్‌వాడీలు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని అన్నారు.

కదిరిఅర్బన్: తమ సమస్యలు పరిష్కరించాలంటూ కలెక్టరేట్ ముట్టడికి వెళ్తున్న అంగన్‌వాడీలను పట్టణ పోలీసులు పోలీసులు అడ్డుకుని అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. దీంతో అంగన్‌వాడీ నాయకురాళ్లు మాట్లాడుతూ ప్రభుత్వం తమ సమ్మెను పోలీసుల ద్వారా అణచి వేయాలని చూడడం హేయమైన చర్య అని అన్నారు. సమస్యలు పరిష్కరించే వరకు ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.

పోలింగ్ కేంద్రాల్లో వసతులపై నివేదిక ఇవ్వండి

- కలెక్టర్ అరుణ్‌బాబు

పుట్టపర్తి, జనవరి 3: జిల్లావ్యాప్తంగా పోలింగ్ కేంద్రాల్లో వసతులపై నివేదిక ఇవ్వాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అరుణ్‌బాబు ఆదేశించారు. రాను న్న సార్వత్రిక ఎన్నికలకు ముంద స్తు ఏర్పాటుపై బుధవారం స్థాని క కలెక్టరేట్‌లో నియోజకవర్గ ఎన్నికల అధికారులతో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. పోలింగ్ కేంద్రాల్లో ఫర్నీచర్, విద్యుత్, బాత్‌రూమ్‌లు, ర్యాంపులు, సౌకర్యాలపై రెండ్రోజుల్లోగా నివేదిక సిద్ధం చేయాలని ఆదేశించారు. ఎన్నికల నిర్వహణకు పీఓలు, ఏపీఓలు, మైక్రో అబ్జర్వర్లు, సెక్టోరియల్ అధికారుల నియామకానికి సంబంధిత శాఖ ల్లో అధికారులు, సిబ్బంది వివరాలను సేకరించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న ఓటరు ఫిర్యాదులపై బీఎల్‌ఓలతో తహసీల్దార్లు సమావేశమై, వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. సమీక్షలో జేసీ అభిషేక్ కుమార్, డీఆర్వో కొండయ్య, పెనుకొండ సబ్‌కలెక్టర్ భరత్, ఆర్డీఓలు భాగ్యరేఖ, వంశీకృష్ణ, సురేష్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్లు, ఎన్నికల సహాయకులు పాల్గొన్నారు.



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు

అర్హులైనవారందరికీ ప్రభుత్వ పథకాలు అందజేస్తున్నామని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ అరుణ్‌బాబు కోరారు. కలెక్టరేట్‌లో ఆయన రూ.82.06 కోట్ల సామాజిక భద్రత పింఛన్ చెక్కును విడుదల చేశారు. అనంతరం మాట్లాడుతూ జిల్లాలో 2,74,839మందికి పింఛన్ సొమ్ము పెరిగిందన్నారు. అలాగే నూతనంగా 3,309 మందికి పింఛన్లు మంజూరయ్యాయన్నారు. వీరందరికీ రూ. మూడువేల చొప్పున పింఛన్ అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, సచివాలయ నోడల్ అధికారి శివారెడ్డి, డీపీఎం రామమోహన్ తదితరులు పాల్గొన్నారు.

గోనుగుంట్లపై విమర్శలను సహించం

ధర్మవరం, జనవరి 3: మాజీ ఎమ్మెల్యే గోనుగుంట్ల సూర్యనారాయణపై విమర్శలు చేస్తే సహించేది లేదని ఆయన అనుచరులు టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ వర్గీయులను హెచ్చరించారు. పట్టణంలోని గోనుగుంట్ల కార్యాలయంలో బుధవారం వారు విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి గోనుగుంట్ల సూర్యనారాయణపై పరిటాల శ్రీరామ్ వర్గీయులు చేసిన విమర్శలపై ఘాటుగా స్పందించారు. మా నాయకుడు టీడీపీని వీడినా ధర్మవరం నియోజకవర్గంలోని అన్ని వర్గాల ప్రజలకు అండగా ఉంటూ ఎప్పటికప్పుడు సమస్యలు పరిష్కరిస్తున్నారని తెలిపారు. గోనుగుంట్ల విజయ్‌కుమార్ తమ నాయకుడిపై విమర్శలు చేయడం చూస్తుంటే దయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉందన్నారు. ఇప్పటికైనా విమర్శలు మానుకోవాలన్నారు. లేకపోతే సహించేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో డిష్‌రాజు, గొట్లూరు చంద్ర, చిగిచెర్ల అరవిందరెడ్డి, తుంపర్తి పరమేశ్, చిలకం సూర్యనారాయణరెడ్డి, దుస్సాక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ మండల కమిటీ ఎన్నిక

అమడగూరు, జనవరి 3: మండలకేంద్రంలోని చౌడేశ్వరీ దేవి కల్యాణ మండపంలో బుధవారం బీజేపీ మండల నూతన కమిటీ ఎన్నికను నిర్వహించారు. రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి, జిల్లా అధ్యక్షుడు జీఎం శేఖర్ ఆదేశాల మేరకు మండల కమిటీని ఎంపిక చేశారు. మండల అధ్యక్షుడిగా సురేంద్రరెడ్డి, ప్రధాన కార్యదర్శులుగా శ్రీనివాసులు, సుబ్రమణ్యం, వెంకటరమణ, ఉపాధ్యక్షులుగా మస్తాన్‌రెడ్డి, రామక్రిష్ణ, వేమనారాయణ, ఓబీసీ మోర్చా అధ్యక్షుడిగా తిప్పన్న, ఎస్సీమోర్చా అధ్యక్షుడిగా నరసింహులు, కిస్సాన్ మోర్చా అధ్యక్షుడిగా వేమనారాయణ, ఉపాధ్యక్షుడిగా చంద్రశేఖర్, మహిళా మోర్చా అధ్యక్షురాలిగా సుభద్రమ్మ, ఉపాధ్యక్షురాలిగా రత్నమ్మ, యువమోర్చా అధ్యక్షుడిగా రవీంద్ర, మైనార్టీ మోర్చా అధ్యక్షుడిగా మహబూబ్‌బాషాతో పాటు 30మందిని కమిటీ సభ్యులను ఎన్నిక చేశారు. సీనియర్ నాయకుల ఆధ్వరంలో కమిటీ ఎన్నిక జరిగింది.

కోడిపందెం నిర్వాహకుల అరెస్టు

తనకల్లు, జనవరి 3: మండలంలోని బండకాడపల్లి గ్రామ సమీపంలో మర్రిమాను గుంత వద్ద మంగళవారం రాత్రి కోడిపందేలు ఆడుతున్న వారిని పోలీసులు అరెస్టు చేశారు. ఏడుగురిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి 9 బైక్‌లు, రెండు కోడిపుంజులు, రూ.7,330 నగదు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రాజశేఖర్ తెలిపారు.

సీఆర్‌పల్లిలో వికసిత్ భారత్

తనకల్లు, జనవరి 3: మండలంలోని చిన్నరామన్నగారిపల్లి గ్రామంలో అధికారులు బుధవారం వికసిత్ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలకు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ పూల నరసింహులు, ఈఓఆర్డీ ఆనందయ్య, ఏఓ శ్రీహరినాయక్, సర్పంచ్ కృష్ణారెడ్డి, ఏపీఓ మరియమ్మ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జయమ్మ, గ్రామస్థులు పాల్గొన్నారు.

నేడు ఈశ్వరీమాత ఆరాధనోత్సవం

ఓబుళదేవరచెరువు, జనవరి 3: మండలంలోని డబురువారిపల్లి పంచాయతీ కుసుమవారిపల్లిలో గురువారం ఈశ్వరీమాతదేవి ఆరాధనోత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు వెంకటరమణప్ప బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం ఆలయంలో అమ్మవారికి అభిషేకం, అర్చన, ప్రత్యేక పూజలు నిర్వహిస్తామన్నారు. సాయంత్రం ఉత్సవ విగ్రహాన్ని ఊరేగిస్తామన్నారు. శుక్రవారం ఆరాధనోత్సవ ముగిపు నిర్వహించనున్నట్లు చెప్పారు. భక్తులు పాల్గొనాలని కోరారు.

సీఐటీయూ నాయకుడికి నోటీసులు

ముదిగుబ్బ, జనవరి 3: జిల్లాకేంద్రంలో బుధవారం అంగన్‌వాడీలు నిర్వహించిన కలెక్టర్ కార్యాలయ ముట్టడికి వెళ్లకూడదంటూ సీఐటీయూ మండల కార్యదర్శి ఆటోపెద్దన్నకు మండల పోలీసులు నోటీసులు అందజేశారు. బుధవారం ఆయన జిల్లా కేంద్రానికి బయలుదేరి వెళ్తుంటే పోలీసులు ఇంటివద్దకు వెళ్లి అడ్డుకుని నోటీసులు అందజేశారు.

వైసీపీకి రాజీనామా చేస్తా..

- పార్టీ యువజన విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి దాదిరెడ్డి మధుసూదన్‌రెడ్డి



దాదిరెడ్డి మధుసూదన్ రెడ్డి

అమడగూరు, జనవరి 3: వైసీపీ అధికారంలోకి రావడానికి తాను ఎంతో శ్రమించానని, పార్టీ ప్రారంభం నుంచి కూడా చాలా కష్టపడ్డానని, అయితే నమ్ముకున్న వారికి అక్కడ అవకాశాలుండవని ఆ పార్టీ యువజన విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి దాదిరెడ్డి మధుసూదన్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని ఏ. కొత్తపల్లిలో బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వైసీపీ కోసం గొడ్డుచాకిరీ చేసినా.. తనకు గుర్తింపు రాలేదన్నారు. పార్టీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మండలంలో గ్రామ గ్రామాన తిరిగి బలోపేతం చేయడానికి ఎంతో కష్టపడ్డానన్నారు. అయితే పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత నమ్ముకున్న కార్యకర్తలకు పార్టీ పెద్దలు, ప్రజాప్రతినిధులు ఏమీ చేయలేదన్నారు. వైసీపీని నమ్ముకుని తన వారికి ఏమీ చేయలేకపోయానని, అందుకే తాను ఆ పార్టీకి రాజీనామా చేయనున్నానని తెలిపారు. త్వరలోనే కార్యాచరణ వెల్లడిస్తానని ఆయన పేర్కొన్నారు.

ఐషర్‌వాహనం నుంచి జారిపడి యువకుడి మృతి

నంబులపూలకుంట, జనవరి 3: కదిరి, రాయచోటి ప్రధాన రహదారిపై ఐషర్ వాహనం నుంచి జారిపడి యువకుడు మృతిచెందాడు. ఎస్‌ఐ ఎన్‌వీ రమణ తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. కదిరినుంచి రాయచోటికి వెళ్తున్న ఐషర్ వాహనంలో కదిరికి చెందిన రోషన్(17) ప్రయాణిస్తున్నాడు. అయితే మండలంలోని బందారుచెట్లపల్లి సమీపంలోకి రాగానే యువకుడు ప్రమాదవశాత్తూ వాహనంలోంచి జారి కింద పడ్డాడు. తీవ్రంగా గాయపడిన అతడిని స్థానికులు కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతుడి మామ షఫీ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

ఇజ్‌తెమాకు భారీగా తరలివచ్చిన ముస్లింలు

గాండ్లపెంట, జనవరి 3: మండలకేంద్రంలో నిర్వహిస్తున్న ఇజ్‌తెమాకు బుధవారం చివరి రోజు కావడంతో వేల సంఖ్యలో ముస్లింలు హాజరయ్యారు. కర్ణాటక, తెలంగాణ, చి త్తూరు, కడప, కర్నూలు, నెల్లూరు తదితర ప్రాంతాల నుంచి ముస్లింలు తరలివచ్చారు. ఇజ్‌తిమాలో మత పెద్దల ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేసి, ఖురాన్ పఠించారు. అనంతరం పలు ఇస్లామిక్ ధర్మాలపై మత పెద్దలు వివరించారు. ముస్లింలకు భోజన వసతి కల్పించారు.



ప్రార్థన చేస్తున్న ముస్లింలు

నిరుద్యోగులకిచ్చిన హామీని నెరవేర్చండి

- ఐక్యవిద్యార్థి సంఘం డిమాండ్



పొట్టి శ్రీరాములు విగ్రహం ఎదుట ఐక్యవిద్యార్థిసంఘం నాయకుల ఆందోళన

ధర్మవరం రూరల్, జనవరి 3: ఎన్నికల హామీలో భాగంగా సీఎం జగన్‌మోహన్ రెడ్డి ప్రతి ఏటా నిరుద్యోగులకు లక్ష ఉద్యోగాలు భర్తీ చేస్తామని చెప్పారని, అయితే ఇంతవరకు నెరవేర్చలేదని ఐక్య విద్యార్థిసంఘం జిల్లా ప్రధానకార్యదర్శి పోతలయ్య వాపోయారు. ప్రభుత్వ తీరును నిరసిస్తూ ఐక్య విద్యార్థి సంఘం నాయకులు బుధవారం పట్టణంలో పొట్టిశ్రీరాములు విగ్రహం ఎదుట ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పోతలయ్య మాట్లాడుతూ సీఎం జగన్ ఎన్నికల కు ముందు నిరుద్యోగులకు ప్రతియేటా జాబ్‌క్యాలెండర్ విడుదల చేస్తామని హామీ ఇచ్చారని, అధికారంలోకి రాగానే నిరుద్యోగులను నట్టేట ముంచారని అన్నారు. రాష్ట్రంలో అన్నిశాఖలకు కలిపి దాదాపు 3లక్షలకు పైగా ప్రభుత్వ ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని ఆర్థికశాఖ చెబుతున్నప్పటికీ సీఎం ఏమాత్రం పట్టించుకోలేదన్నారు. ఇప్పటికైనా ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్లు విడుదల చేయాలన్నారు. లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘం నాయకులు మంజులనరేంద్ర, జగదీష్, సాయికిరణ్, చిన్నవెంకీ, సురేంద్ర, జయపాల్, సునీల్, నందకిషోర్, జగదీష్, వినోద్, కుమార్, సాయి, అమీర్, పవన్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

భూ కబ్జాదారులపై చర్యలు తీసుకోండి

కదిరిఅర్బన్, జనవరి 3: మున్సిపల్ పరిధిలోని సర్వే నంబరు 83లో ఉన్న ప్రభుత్వ భూమిని కబ్జా చేసేందుకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని పట్టణంలోని ఆర్పీపీ నాయకులు బుధవారం ఆర్డీఓ వంశీకృష్ణకు వినతిపత్రం అందించారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ కబ్జాలపై సంబంధితాధికారులకు తెలిపినా పట్టించుకోలేదన్నారు. భూ కబ్జాదారులకు తహసీల్దార్ కార్యాలయంలోని ఆర్‌ఐస్థాయి అధికారి సహకరిస్తున్నట్లు చెప్పారు. దీనిపై స్పందించి చర్యలు తీసుకుని, ప్రభుత్వభూమిని కాపాడాలని కోరారు. కార్యక్రమంలో ఆర్పీపీ నాయకులు రవిశంకర్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, అరుణ్‌కుమార్, నాగన్న తదితరులు పాల్గొన్నారు.

డిపో అభివృద్ధికి కృషి చేయండి

కదిరిఅర్బన్, జనవరి 3: కదిరి ఆర్టీసీ డిపో అభివృద్ధి చేసేందుకు, ఆదాయం సమకూర్చేందుకు కండెక్టర్లు, డ్రైవర్లు కృషి చేయాలని డిపో మేనేజర్ మైనొద్దీన్ సూచించారు. కదిరి డిపోలో అత్యధిక ఆదాయం తెచ్చిన కండెక్టర్ కడపల నారాయణరెడ్డిని బుధవారం ఆయన అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డ్రైవర్లు, కండెక్టర్లు నారాయణరెడ్డిని ఆదర్శంగా తీసుకుని డిపో అభివృద్ధికి, ఆదాయానికి కృషి చేయాలని కోరారు.

బీసీ సదస్సుకు తరలిన టీడీపీ నాయకులు

కొత్తచెరువు, జనవరి 3: విజయవాడలో జరిగే బీసీ సదస్సుకు టీడీపీ నాయకులు, కార్యకర్తలు బుధవారం తరలివెళ్లారు. పుట్టపర్తిలోని పార్టీ కార్యాలయం వద్ద మాజీ మంత్రి పల్లెరఘునాథరెడ్డి ఏర్పాటుచేసిన బస్సుల్లో కొత్తచెరువు, పుట్టపర్తి, బుక్కపట్నం మండలాలకు చెందిన బీసీ నాయకులు పెద్ద ఎత్తున బయలుదేరి వెళ్లారు. తరలిన వారిలో కొత్తచెరువు కన్వీనర్ ఒలిపిశీన, నల్లమాడ, ఓడీసీ కన్వీనర్లు శంకర, జయచంద్ర తదితరులు ఉన్నారు.

అగ్నిప్రమాదంలో బంకు దగ్ధం

తనకల్లు, జనవరి 3: మండలంలోని చీకటిమానుపల్లి గ్రామ సమీపంలో మంగళవారం రాత్రి అగ్నిప్రమాదం సంభవించి వెంకటరమణకు చెందిన కిరాణా బంకు పూర్తిగా కాలిపోయింది. దీంతో బంకులో ఉన్న నిత్యావసర వస్తువులు, దుస్తులు, వంట సామాన్లు, తిండిగింజలు అగ్నికి ఆహుతయ్యాయి. ప్రమాదంలో రూ.లక్ష ఆస్తినష్టం జరిగినట్లు బాధితుడు తెలిపారు. ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు కావాలనే నిప్పు పెట్టి తనకు జీవనాధారమైన బంకును కాల్చివేశారని ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు. సంఘటనాస్థలంలో మద్యం బాటిళ్లు పడి ఉన్నట్లు చెప్పారు. అగ్నిప్రమాదంలో జీవనాధారం కోల్పోయిన ప్రభుత్వం ఆదుకోవాలని ఆయన కోరారు.

అర్హులకు ఓటుహక్కు కల్పించడమే ధ్యేయం

ధర్మవరంరూరల్, జనవరి3: 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడమే తమ ధ్యేయమని ఆర్డీఓ రమేష్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయంలోని తన చాంబర్‌లో బుధవారం ఆయన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఎన్నికల అంశంపై సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఓటుహక్కును పొందుట, చేర్పులు, మార్పులు, తొలగింపులు వంటి విషయాలలో బీఎల్వోలతో రాజకీయనాయకులు సహకరించాలని కోరారు. నిబంధనలను విరుద్ధంగా వ్యవహరిస్తే బీఎల్వోలపై చర్యలు తీసుకుంటామన్నారు. ఈనెల 5వ తేదివరకు ఆన్‌లైన్‌లో గానీ, బీఎల్‌ఓల ద్వారా వచ్చిన దరఖాస్తులను స్వీకరించి విచారణ చేయించి తుదిజాబితాను విడుదల చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్ యుగేశ్వరిదేవి, సిబ్బంది రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

తెగిపడిన 11కేవీ విద్యుత్‌వైరు

కొత్తచెరువు, జనవరి 3: మండల కేంద్రంలోని పెనుకొండ రహదారి సమీపంలోగల టీచర్స్‌కాలనీలో బుధవారం 11కేవీ విద్యుత్ వైరు తెగిపడింది. ఆ సమయంలో జన సంచారం లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. 11కేవీ వైరు తెగిపడిన వెంటనే అక్కడే ఉన్న గడ్డిలో మంటలు వ్యాపించాయని స్థానికులు తెలిపారు. దీనిని గమనించిన వెంటనే ట్రాన్స్‌కో అధికారులకు సమాచారం అందించారు. దీంతో ట్రాన్స్‌కో అధికారులు తక్షణమే స్పందించి 11కేవీ వైరు మరమ్మతులు చేపట్టారు.

మహిళా సంఘాలు ఆర్థికాభివృద్ధి సాధించాలి

ఓబుళదేవరచెరువు, జనవరి 3: మహిళసంఘాలు ఆర్థికాభివృద్ధి సాధించాలని ఏపీఎం రమణప్ప పేర్కొన్నారు. మండలకేంద్రంలోని పల్లవీ సమాఖ్య కార్యాలయంలో బుధవారం ఆయన లక్‌పతీ దీదీ అనే అంశంపై గ్రామ సంఘాల సహాయకులు, సిబ్బందికి ఓరియెంటేషన్ నిర్వహించి మాట్లాడారు. మహిళా సంఘంలోని సభ్యురాళ్లను లక్షాధికారులను చేయడమే ఈకార్యక్రమ ఉద్దేశమన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలను మహిళ సంఘాల సభ్యులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏపీఎంలు ,సీసీలు వీఓఎలు పాల్గొన్నారు.

ఘనంగా సావిత్రీబాయి పూలే జయంతి

- పలు చోట్ల ఉపాధ్యాయినులకు సన్మానం

కదిరిఅర్బన్, జనవరి 3: సామాజిక సంఘ సేవకురాలు, దేశ తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రీబాయి పూలే జయంతి వేడుకలను కదిరి పట్టణంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. బహుజన సమాజ్ పార్టీ నాయకులు స్థానిక పూలే సర్కిల్‌లో ఆమె చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. అణగారిన వర్గాల అభ్యున్నతికి, విద్యారంగ అభివృద్ధికి ఆమె చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు కోలా సురేంద్రనాథ్‌బెనర్జీ, అంపావతిని గోవిందు, శంకర్, సాయిశీనా పాల్గొన్నారు. మండలంలోని కుమ్మరవాండ్లపల్లి జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో సావిత్రీబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తర్వాత ఉపాధ్యాయినులు భాగ్యలక్ష్మి, సుభాషిణి నిర్మల, మరియమ్మ, విద్యారాణి, చంద్రకళ, గాయత్రి, నాగజ్యోతి, కవిత, మధురవాణిలను సన్మానించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రాజగోపాల్ రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ధర్మవరం: పట్టణంలోని ఏపీటీఎఫ్ నాయకులు స్థానిక శాంతినగర్‌లో గల ఉన్నతపాఠశాలలో సావిత్రీబాయి పూలే జయంతి సందర్భంగా ఉపాధ్యాయినులు రాధారాణి, భారతి, విరీషా, కవిత, ప్రణీత, లావణ్య, షజిదాలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు సానే రవీంద్రారెడ్డి, పట్టణ ప్రధానకార్యదర్శి జగదీశ్ తదితరులు పాల్గొన్నారు. సూర్య పాఠశాలలో హెచ్‌ఎం నరేంద్రబాబు, ఉపాధ్యాయులు, విద్యార్థులు కేక్ కట్ చేసి జయంతి వేడుకలను జరుపుకున్నారు.

అమడగూరు: మండలంలోని మహమ్మదాబాద్ పి.మస్తాన్‌రెడ్డి జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో సావిత్రీబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టి అలరించారు.

కొత్తచెరువు: మండలకేంద్రంలోని విజయనగర కాలనీలో గల ఆర్డీటీ పాఠశాలలో సావిత్రీబాయి పూలే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తర్వాత సమాజానికి ఆమె చేసిన సేవలను ఆర్డీటీ టీచర్ చంద్రాయుడు కొనియాడారు.



కదిరి మండలం కుమ్మవాండ్లపల్లిలో ఉపాధ్యాయినులను సన్మానిస్తున్న దృశ్యం



ధర్మవరంలోని ఉన్నత పాఠశాలలో..

అటవీ ఫలసేకరణపై సర్వే

తాడిమర్రి, జనవరి 3: అటవీ ఉత్పత్తులు, ఫలసేకరణపై బెంగళూరుకు చెందిన ఐడబ్ల్యూఎస్‌టీ కార్యాలయ సిబ్బంది మమత, రేఖ, శ్వేత, నాగరాజు బుధవారం తాడిమర్రి మండలంలో సర్వే నిర్వహించారు. మండలంలోని చిల్లకొండయ్యపల్లి, చిల్లవారిపల్లి, దాడితోట, కునుకుంట్ల, రామాపురం గ్రామాల్లో సర్వే జరిపి ఆయా గ్రామాల ప్రజల నుంచి అభిప్రాయాలు సేకరించారు. తేనె, పండ్లు, గడ్డి , కలప ద్వారా ఏవిధంగా సాయం పొందుతున్నారో అడిగి తెలుసుకుని నమోదు చేసుకున్నారు. చిల్లకొండయ్యపల్లి గ్రామానికి చెందిన 25 మంది గ్రామస్థులు ఒక్కొక్కరు 300 కేజీల తేనేను సేకరించి కేజీ రూ.400లతో చెన్నేకొత్తపల్లిలోని ధరణి కో ఆపరేటివ్ సొసైటీలో అమ్మి లాభం పొందినట్టు తెలిపారు. అటవీ సంపదకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా చూసుకోవాల్సిన బాధ్యత గ్రామస్థులదేనని సర్వే సిబ్బంది తెలిపారు.

కార్యక్రమంలో ఫారెస్టు బీట్ ఆఫీసర్ సూర్యనారాయణ, వనసంరక్షణ సమితి అధ్యక్షుడు వెంకటరాముడు తదితరులు పాల్గొన్నారు.



భక్తిగీతాలు ఆలపిస్తున్న సాయి యూత్ బృందం సభ్యులు

అలరించిన సంగీత కచేరి

పుట్టపర్తి, జనవరి 3: సిక్కింకు చెందిన సాయి యూత్ బృందం సభ్యులు సంగీత కచేరి చేపట్టి భక్తులను అలరించారు. పట్టణంలోని ప్రశాంతి నిలయంలో గల సాయి కుల్వంత్ హాల్లో బుధవారం రాత్రి వారు రెండోరోజూ భక్తి సంగీత్ పేరుతో పాట కచేరి నిర్వహించారు. గంటపాటు కమనీయ గీతాలు ఆలపించి భక్తులను అలరించారు. అనంతరం సత్యసాయి మహా సమాధిని దర్శించున్నారు.

ఘనంగా మానసాదేవి విగ్రహ ప్రతిష్ఠ

పెనుకొండ, జనవరి 3 : స్థానిక నగరేశ్వరస్వామి దేవాలయంలో బుధవారం మానసాదేవి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. బుధవారం ఉదయం ప్రాతఃకాలపూజలు, అభిషేకాలు, హోమాలు, ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం అన్నసంతర్పణ చేపట్టారు. పెద్దఎత్తున భక్తులు హాజరయ్యారు.



ఆలయ ప్రాంగణంలో ప్రతిష్ఠించిన మానసాదేవి విగ్రహం

ఆరాధనోత్సవాలు ప్రారంభం

లేపాక్షి, జనవరి 3: మండలంలోని కంచిసముద్రం గ్రామంలో వెలసిన గోందావళి సద్గురు బ్రహ్మచైతన్యస్వామి ఆరాధనోత్సవాలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. స్వామివారి ఆలయంలో ఉదయం రుద్రాభిషేకం, గోపూజ, సహస్రనామపూజ, నవగ్రహజపం, సూర్యప్రార్థన, అఖండ రామభజన, సుందరకాండ పారాయణం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

నేడు దీపోత్సవం

స్వామివారి ఆలయంలో గురువారం దీపోత్సవం, 5న శుక్రవారం స్వామివారి బ్రహ్మరథోత్సవం నిర్వహిస్తామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పూజా కార్యక్రమాల్లో పాల్గొనాలని కోరారు.

11న సామాజిక తనిఖీ ప్రజావేదిక

అగళి, జనవరి 3 : స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఈనెల 11వ తేదీన ఉదయం 11గంట లకు జాతీయ ఉపాధిహామీ పథకం ద్వారా చేపట్టిన సామాజిక తనిఖీపై ప్రజావేదిక నిర్వహిస్తున్న ట్లు ఎంపీడీఓ రవిప్రసాద్, ఏపీఓ శిన్న తెలిపారు. గత డిసెంబర్ 26నుంచి జనవరి 10వరకు గ్రామాలలో జరిగిన ఉపాధిహామీ పనులపై సామాజిక తనిఖీని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పనులపై ప్రజావేదిక నిర్వహిస్తారన్నారు. మండలంలోని అధికార ప్రజాప్రతినిధులు, అధికారులు ఉపాధికూలీలు తదితరులు హాజరు కావాలన్నారు. ఏవైనా లోటుపాట్లు ఉన్నా బహిరంగ ప్రజావేదికలో తెలియజేయాలని కోరారు.

మున్సిపల్ కమిషనర్‌కు మెమో



సమావేశంలో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ అపూర్వ భరత్

మడకశిరటౌన్, జనవరి 3: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం ఎన్నికలకు సంబంధించి పెనుకొండ సబ్ కలెక్టర్ అపూర్వ భరత్ అఖిల పక్ష సమావేశాన్ని నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ ప్రభాకర్‌రావు సమావేశానికి హాజరుకాకుండా మేనేజర్‌ను పంపడంతో సబ్ కలెక్టర్ మెమో జారీ చేశారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి జరిగే సమావేశాలకు అధికారులు హాజరుకావాలని నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు. అనంతరం ఎన్నికల ఫారం-6 ఫారం-7 ఫారం-8 తదితర వాటిపై చర్చించారు. ఓటరు వెరిఫికేషన్‌పై అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ హసీనా సుల్తాన్, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ మారుతీప్రసాద్‌తోపాటు వివిధ పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న పథకాలన్నీ కేంద్రానివే

బీజేపీ నాయకులు



గ్యాస్ పథకంపై అవగాహన కల్పిస్తున్న బీజేపీ నాయకులు

పెనుకొండ రూరల్, జనవరి 3: రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలన్నీ ప్రధాని నరేంద్రమోదీ ప్రవేశపెట్టినవేనని బీజేపీ జిల్లా కార్యదర్శి ఎనుమల రామక్రిష్ణ పేర్కొన్నారు. వికసిత్ భారత్ సంకల్పయాత్రలో భాగంగా బుధవారం పట్టణంలోని అంబేడ్కర్ సర్కిల్‌లో బీజేపీ నాయకులు, అధికారులతో కలిసి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా రామక్రిష్ణ మాట్లాడుతూ... రాష్ట్రంలో రైతులకు, కార్మికులకు, మహిళలు తదితరులకు సంబంధించిన సంక్షేమ పథకాలన్నీ ప్రధాని నరేంద్రమోదీ అమలు చేస్తు న్నవేనని ప్రజలకు వివరించారు. అనంతరం గ్యాస్ సిలిండర్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కమిషనర్ వంశీకృష్ణభార్గవ్, ఐసీడీఎస్ అధికారులు, బీజేపీ నాయకులు సుభాష్, రవి, హనుమంతయాదవ్, అమృతయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

అచ్చెన్నాయుడును కలిసిన మడకశిర నాయకుడు

మడకశిర రూరల్, జనవరి 3: గ్రామస్థాయిలో టీడీపీ చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనడంతో మడకశిర మండలం కల్లుమర్రి గ్రామానికి చెందని క్లస్టర్ ఇన్‌చార్జ్ నాగరాజును టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు అభినందించారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో బుధవారం అచ్చెనాయుడును కలిసినట్లు నాగరాజు తెలిపారు. టీడీపీ సభ్యత్వ నమోదు, ఇదేమి ఖర్మ రాష్ట్రానికి, టీడీపీ మినీ మేనిఫెస్టోలోని వివరాలను చురుకుగా ప్రజల్లోకి తీసుకెళ్లారని ఆయన అభినందించినట్లు నాగరాజు తెలిపారు.



నాగరాజును అభినందిస్తున్న అచ్చెన్నాయుడు

పాముకాటుతో వ్యక్తి మృతి

గుడిబండ, జనవరి 3 : మండలంలోని సీసీగిరి గ్రామానికి చెందిన సిద్దప్ప(48) అనే వ్యక్తి పాముకాటుతో బుధవారం మృతి చెందాడు. సిద్దప్ప ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో మంగళవారం రాత్రి పాము కాటేసింది. వెంటనే కుటుంబ సభ్యులు మడకశిర ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో కర్ణాటకలోని తుమకూరు ఆసుపత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యంలో మృతిచెందినట్లు గ్రామస్థులు కుటుంబసభ్యులు తెలిపారు. మృతుడికి భార్య తేజోవతి, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుటుంబ పెద్ద కోల్పోవడంతో కుటుంబం వీధినప డిందని బోరున విలపించారు. పాముకాటుతో మృతిచెందిన సిద్దప్ప కుటుంబానికి ప్రభుత్వం ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలని గ్రామస్థులు కోరారు.



సిద్దప్ప (ఫైల్)



పురం వద్ద టూరిస్టుల్లా కర్ణాటక బస్సులో తరలివెళ్తున్న అంగన్‌వాడీలు



పెనుకొండ పోలీస్‌స్టేషన్‌లో అంగన్‌వాడీలు



మడకశిర పోలీస్‌స్టేషన్‌కు తరలించిన అంగన్‌వాడీలు

ఎక్కడికక్కడ అంగన్‌వాడీల అరెస్ట్

హిందూపురం అర్బన్/ పెనుకొండటౌన్/ మడకశిర టౌన్/ అగళి/ రొద్దం, జనవరి 3: తమ న్యాయమైన కోర్కెలు సాధించుకునేందుకు అంగన్‌వాడీ లో 23 రోజులుగా సమ్మె చేస్తూనే ఉన్నారు. అయినా ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో బుధవారం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జిల్లా కలెక్టరేట్ల ముట్టడి చేపట్టారు. దీంతో పోలీసులు ముందస్తుగా మంగళవారం నుంచే ఎక్కడికక్కడ వారి అరెస్టులు చేపట్టారు. సమ్మెకు అను మతులు లేవంటూ చాల మందికి నోటీసులు అందించారు. అయినప్పటికి చాలామంది అంగన్‌వాడీలు పట్టువదలని విక్రమార్కుల్లా కలెక్టర్ కార్యాలయం ముట్టడికి తరలివెళ్లారు. కొంత మంది మంగళవారం రాత్రే జిల్లా కేంద్రానికి చేరుకుని బస్సుల్లో, రోడ్డుపక్కన చలికి వణుకుతూ ఉండిపోయారు. ఇంకొంత మంది ఆర్టీసీ బస్సుల్లో, ప్రైవేట్ వాహనాల్లో తరలివెళ్లారు. బ స్సుల తనిఖీలు చేసిన పోలీసులు అంగన్‌వాడీలను గుర్తించి వారిని దించి వేశారు. దీంతో వారు ఏడు కిలో మీటర్ల దూరంలో ఉన్న కలెక్టర్ కార్యాల యానికి కాలినడకన చేరుకుని సమ్మెలో పాల్గొన్నారు. కొందరు మాస్కులు ధరించి ప్రయాణికుల్లా చేరుకున్నారు. ఇంకొంతమంది అయితే కర్ణాటక వాహనాల్లో టూరిస్టుల్లా తరలివెళ్లారు. కలెక్టరేట్ ముట్టడికి తరలివెళ్తున్న హిందూపురం, పెనుకొండ నియోజకవర్గాల్లోని పలువురు అంగన్‌వాడీలను పోలీసులు అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అలాగే మడకశిర, గుడిబండకు చెందిన అంగన్‌వాడీలను పెనుకొండ వద్ద పోలీసులు అరెస్టు చేసి మడకశిర పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. దీనిని సీఐటీయూ, ఎస్ఎఫ్ఐ నాయకులు వీరేష్ తదితరులు ఖండించారు. అగళి, రొద్దం, సోమందేపల్లి నుంచి తరలుతున్నా అంగన్‌వాడీలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.



అగళిలో పోలీస్ కస్టడీలో...



రొద్దం పోలీస్ స్టేషన్‌లో..

నోటీసుల జారీ

గోరంట్ల, , జనవరి 3: పుట్టపర్తిలోని జిల్లా కలెక్టర్ కార్యాలయం ముట్టడికి అంగన్‌వాడీ కార్యకర్తలు గోరంట్లనుంచి వెళ్లకుండా పోలీసులు మంగళవారం రాత్రి నోటీలు జారీ చేశారు. పథకం ప్రకారం ముందుగానే మంగళవారం సాయంత్ర నుంచే తమ ఇళ్లకు బయట నుంచి తాళం వేయించి గుట్టుచప్పుడుకాకుండా ఇంట్లోనే ఉన్నట్లు ప్రముఖ అంగన్‌వాడీ కార్యకర్తలు తెలిపారు. దీంతో పోలీసులు ఇళ్లకు వేసిన తాళాలు చూసి, లేరనుకుని వెళ్లిపోయినట్లు చెప్పారు. తెల్లవారుజామున ప్రత్యేక వాహనంలో పుట్టపర్తికి తరలి వెళ్లామన్నారు. నోటీసులు అందుకున్న అంగన్‌వాడీలు సైతం పుట్టపర్తి ఆందోళనలో పాల్గొన్నట్లు చెప్పారు.

గుడిబండ: జిల్లా కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమానికి పిలుపునివ్వడంతో మండలం నుంచి అంగన్‌వాడీ కార్యకర్తలు పెద్దఎత్తున తరలి వెళ్లారు. యూనియన్ అధ్యక్షురాలు మహదేవమ్మ, లక్ష్మీదేవి ఆధ్వర్యంలో తరలివెళ్లి బుధవారం ధర్నా కార్యక్రమంలో పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల సమ్మె ఉధృతం



ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఇంజనీరింగ్ సిబ్బంది నిరసన



సీఐటీయూ ఆధ్వర్యంలో ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ కార్మికులు

హిందూపురం, జనవరి 3 : తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలంటూ మునిసిపల్ పారిశుధ్య ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ కార్మికులు చేపడుతున్న సమ్మె బుధవారం కొనసాగింది. ఉదయం కార్మికులు వీధుల గుండా తిరుగుతూ ప్రైవేట్ కార్మికులు, రెగ్యులర్ కార్మికులు చేపడుతున్న పారిశుధ్య పనులను అడ్డగించి రోడ్లపైనే చెత్త వేశారు. అనంతరం మునిసిపల్ కార్యాలయంలో నిరసన దీక్షలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం తమ డిమాండ్లు పరిష్కరించకపోతే సమ్మె కొనసాగుతూనే ఉంటుందన్నారు. ఇప్పటికైనా మొండి వైఖరి వీడి తమ న్యాయమైన డిమాండ్లను ఒప్పుకోవాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

ఇంజనీరింగ్ విభాగం కార్మికుల ఆందోళన

ఇదిలా ఉంటే మునిసిపల్ పారిశుధ్య కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులతో పాటు మునిసిపల్ ఇంజనీరింగ్ సిబ్బంది కూడా తమను రెగ్యులర్ చేయాలంటూ బుధవారం నుంచి నిరసనకు దిగారు. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో వారు మునిసిపాలిటీ మరోగేటువద్ద నిరసన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగన్ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఇచ్చినహామీలను అమలు చేయాని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు వినోద్, మునిసిపల్ ఇంజనీరింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు అఖిల్‌రాజ్, వరదరాజులు, నరేష్, శ్రీనివాసులు, రాధమ్మ, నాగలక్ష్మి, మూర్తి, గంగాధర్, మంజునాథ్, మహేంద్ర, పారిశుధ్య సంఘం నాయకులు ముత్యాలప్ప, ఈరప్ప, అంజి, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

మడకశిరటౌన్: తమ డిమాండ్లు పరిష్కరించాలంటూ మున్సిపల్ కార్మికులు బుధవారం పట్టణంలో భిక్షాటన చేస్తూ వినూత్నరీతిలో నిరసన తెలిపారు. సీఐటీయూ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



మడకశిర అంబేడ్కర్ సర్కిల్‌లో భిక్షాటన చేస్తూ నిరసన

పోలింగ్ కేంద్రాల్లో వసతులపై నివేదిక ఇవ్వండి

కలెక్టర్ అరుణ్‌బాబు



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు

పుట్టపర్తి, జనవరి 3: జిల్లావ్యాప్తంగా పోలింగ్ కేంద్రాల్లో వసతులపై నివేదిక ఇవ్వాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అరుణ్‌బాబు ఆదేశించారు. రానున్న సార్వత్రిక ఎన్నికలకు ముందస్తు ఏర్పాటుపై బుధవారం స్థానిక కలెక్టరేట్‌లో నియోజకవర్గ ఎన్నికల అధికారులతో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. పోలింగ్ కేంద్రాల్లో ఫర్నిచర్, విద్యుత్, బాత్‌రూమ్‌లు, ర్యాంపులు, సౌకర్యాలపై రెండ్రోజుల్లోగా నివేదిక సిద్ధం చేయాలని ఆదేశించారు. ఎన్నికల నిర్వహణకు పీఓలు, ఏపీఓలు, మైక్రో అబ్జర్వర్లు, సెక్టోరియల్ అధికారుల నియామకానికి సంబంధిత శాఖల్లో అధికారులు, సిబ్బంది వివరాలను సేకరించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న ఓటరు ఫిర్యాదులపై బీఎల్‌ఓలతో తహసీల్దార్లు సమావేశమై, వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. సమీక్షలో జేసీ అభిషేక్ కుమార్, డీఆర్వో కొండయ్య, పెనుకొండ సబ్‌కలెక్టర్ భరత్, ఆర్డీఓలు భాగ్యరేఖ, వంశీకృష్ణ, సురేష్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్లు, ఎన్నికల సహాయకులు పాల్గొన్నారు.

పురం చెత్తమయం

- ◆ డస్ట్ బిన్‌లలో ఉండాల్సిన చెత్త.. రోడ్లపై...
- ◆ మరో రెండు రోజులు ఇలానే ఉంటే ప్రజలు రోగాలపాలు
- ◆ ఆగ్రహిస్తున్న పట్టణ ప్రజలు



అంబేడ్కర్ సర్కిల్‌లో పేరుకున్న చెత్తా చెదారం

హిందూపురం అర్బన్, జనవరి 3: పురం మొత్తం చెత్తమయమైంది. ఏ రోడ్డు చూసినా చెత్తా చెదారంతో దర్శనమిస్తున్నాయి. సాధారణంగా ఉదయం చూడగానే పట్టణంలో ప్రతి వీధి శుభ్రంగా కనిపించేది. కానీ మునిసిపల్ కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ పారిశుధ్య కార్మికులు తొమ్మిది రోజులుగా సమ్మెబాట పట్టారు. దీంతో ఎక్కడి మురుగు అక్కడే నిలిచిపోయింది. ఎక్కడి చెత్త అక్కడే తిష్టవేసింది. రోడ్ల పక్కన డస్ట్ బిన్‌లలో చెత్త పేరుకుపోయి అటుగా వెళ్లాలంటేనే భరించలేనంత దుర్వాసన వస్తోంది. ఇదిలా ఉండగా మంగళవారం రాత్రి రాష్ట్ర నాయకులతో ప్రభుత్వం జరిపిన చర్చలు విఫలం కావడంతో పారిశుధ్య కార్మికుల ఆగ్రహం కట్టలు తెంచుకుంది. డస్ట్ బిన్‌లలో ఉండాల్సిన వ్యర్థ పదార్థాలు, చెత్తాచెదారాన్ని తీసుకొచ్చి రోడ్లపై పడవేశారు. ప్రజలు ఉదయం లేచి బజారుకు వెళ్తుంటే రోడ్డు మొత్తం చెత్తతో నిండిపోవడం చూసి అవాక్కయ్యారు. కార్మికుల పట్ల ప్రభుత్వ తీరును తప్పుపట్టారు. ఈ దుర్గంధం భరించలేకున్నామని ఇలానే ఇంకో రెండు రోజులు ఉంటే అనారోగ్యంతో ఆసుపత్రికి చేరడం ఖాయమని అంటున్నారు. మునిసిపాలిటీకి అన్ని పన్నులు సక్రమంగా కడుతుంటే పట్టణాన్ని సుందరీకరించాల్సి పోయి ఇలా చెత్తపురంగా తయారు చేస్తున్నారని ఆగ్రహిస్తున్నారు. ఉన్నతాధికారులు, నాయకులు వెంటనే స్పందించి రోడ్డుపైఉన్న తొలగించేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.



ధర్మపురం ఏఎంఎస్ ఫంక్షన్ హోల్ వద్ద..

మాట నిలబెట్టుకోవాలి



మునిసిపల్ కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ పారిశుధ్య కార్మికులను అన్ని విధాలా ఆదుకుంటానని సీఎం జగన్ గత ఎన్నికల్లో ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి. సుప్రీం కోర్టు ఆర్డర్‌ను అమలు చేస్తూ రూ.26 వేలు వేతనం ఇవ్వాలి. కాలువల్లో దిగి పని చేస్తున్న పరికరాలు, చేతులకు హ్యాండ్ గౌజ్‌లు, సబ్బులు, డెటాయిల్, తదితర వస్తువులు అందించాలి. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి.

- జగదీష్, మునిసిపల్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి

పర్మినెంట్ చేయాలి



సమాజం ఆరోగ్యకరంగా ఉండాలని మా ఆరోగ్యాన్ని సైతం లెక్కచేయకుండా... చూస్తేనే అస్యహించుకునేలా ఉన్న వాటిని సైతం చేతులతో ఎత్తుతున్నాం. మేము రోగాలతో పడినా ప్రజలు బాగుండాలని కోరుకుంటూ పని చేస్తున్నాం. రెగ్యులర్ కార్మికుల కంటే ఎక్కువగా పని చేస్తున్నాం. మా కష్టాన్ని ప్రభుత్వం గుర్తించి పర్మినెంట్ చేయాలి. **- సంజీవమ్మ, కార్మికురాలు**

ప్రాణాలు ఫణంగా పెట్టి.. పని చేశాం



కరోనా సమయంలో కనీసం కన్నవారు కూడా చేయని పనులు చేశాం. ప్రజలందరూ బాగుండాలిని కోరుతూ అన్ని పనులూ చేశాం. అలాంటి మాకు అన్యాయం జరుగుతుంటే ఊరుకునేది లేదు. రెగ్యులర్ చేస్తామని మాట ఇచ్చి ఐదేళ్లు అయినా చేయలేదు.

- సాకే రత్నమ్మ, కార్మికురాలు

యూటీఎఫ్ నాయకుడికి నోటీసులు

పెనుకొండ, జనవరి 3 : సమస్యల పరిష్కారం కోరుతూ ఉపాధ్యాయులు చేపట్టిన నిరసన కార్యక్రమంలో భాగంగా బుధవారం ఉపాధ్యాయుల సంఘాల ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. కార్యక్రమాన్ని విఫలం చేయాలనే ఉద్దేశంతో పోలీసులు ధర్నాకు వెళ్లనీయకుండా ఉపాధ్యాయ సంఘాల నాయకులకు నోటీసులు అందించారు. బుధవారం ఉదయం యూటీఎఫ్ నాయకుడు నారాయణస్వామికి పెనుకొండలో పోలీసులు నోటీసులు అందించారు.



యూటీఎఫ్ నాయకుడు నారాయణస్వామికి నోటీసు అందిస్తున్న కానిస్టేబుల్

వైద్యశిబిరాన్ని తనిఖీ చేసిన డీఎంహెచ్ఓ

పెనుకొండ, జనవరి 3: ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ప్రభుత్వ వైద్య ఆరోగ్య శాఖాధికారి (డీఎంహెచ్ఓ) కృష్ణారెడ్డి పేర్కొన్నారు. ఆయన బుధవారం స్థానిక సెంట్రల్ ఉన్నత పాఠశాలలో ఆరోగ్య వైద్య శిబిరాన్ని పరిశీలించారు. నగర పంచాయతీ కమిషనర్ వంశీకృష్ణ భార్గవ్ శిబిరాన్ని ప్రారంభించారు. డీఎంహెచ్ఓ కృష్ణారెడ్డి ఆకస్మిక తనిఖీ చేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ... అవసరమైన వారు ఈ శిబిరాలను సద్వినియోగం చేసుకుని ఆరోగ్యవంతులు కావాలన్నారు. ఆయన వెంట ఎన్‌హెచ్ఎం నాగరాజు, పీఓ త్రిలోక్‌నాథ్, డాక్టర్ సౌమ్య, చంద్రశేఖర్, సూపర్‌వైజర్లు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

వాణిజ్య భవన సముదాయం ప్రారంభం

గోరంట్ల, జనవరి 3: పట్టణంలోని పంచాయతీ బస్టాండ్‌లో రూ. 2.5 కోట్లతో నిర్మించిన 45 గదుల వాణిజ్య సముదాయాన్ని ఎమ్మెల్యే మాలగుండ్ల శంకర్ నారాయణ బుధవారం ప్రారంభించారు. గోరంట్ల మేజర్ పంచాయతీ ద్వారా సర్పంచ్ సరోజనాగేనాయక్ వ్యాపారులనుంచి రూ.70లక్షలు డిపాజిట్లను సేకరించారు. గదులను ఏడేళ్ళపాటు తక్కువ అద్దెలకు కేటాయించేలా ముందస్తు ఒప్పందం కుదుర్చు కున్నారు. మిగిలిన నిధులను పంచాయతీద్వారా వెచ్చించారు. ప్రారంభోత్సవానికి ఎమ్మెల్యే శంకర్‌నారాయణ, ఎమ్మెల్సీ మంగమ్మ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఉపసర్పంచ్ రాజారెడ్డి, వార్డు సభ్యులు, డీపీ ఓ విజయ్ కుమార్‌రెడ్డి, డీఎల్‌పీఓ శివకుమారి, ఎంపీడీఓ రఘునాథ్‌గుప్త, పీఆర్‌డీఈ వెంకటరమణ, ఈఓ బాబురావు, ఎంపీపీ ప్రమీల, జడ్పీటీసీ పాలే జయ రాంనాయక్, వైసీపీ నాయకులు నాగేనాయక్, శంకర్‌రెడ్డి, పో తుల రామ క్రిష్ణరెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, నాగభూషణరెడ్డి, డాక్టర్ బాషా, నూర్‌మహమ్మద్, జబ్బార్, లక్ష్మీనరసింహారెడ్డి, సమరసింహారెడ్డి తదితరులున్నారు.



వాణిజ్య భవన సముదాయాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ సరోజ నాగేనాయక్

భార్య కాపురానికి రాలేదని ఆత్మహత్య

పావగడ, జనవరి 3: భార్య కాపురానికి రాలేదని జీవితంపై విరక్తి చెంది చంద్రశేఖర(27) అనే యువకుడు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తండ్రి రామాంజనప్ప, పోలీసులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. తాలూకాలోని దొమ్మతిమర్రి గ్రామ పంచాయతీ బోడరహళ్లికి చెందిన రామాంజనప్ప కుమారుడు చంద్రశేఖర్. ఇదే తాలూకాలోని గుమ్మగట్ట గ్రామానికి చెందిన షర్మిల అనే యువతితో నాలుగేళ్ల క్రితం వివాహమైంది. వీరికి సంవత్సరం కుమారుడు ఉన్నాడు. షర్మిల వారానికి రెండు మూడు సార్లు ఎవ్వరికీ చెప్పకుండా తన పుట్టినిల్లు అయిన గుమ్మగట్టకు వెళ్లేది. అక్కడి నుంచి షర్మిల అక్క రామాంజనమ్మ గ్రామమైన ఆంధ్రాలోని శ్రీసత్యసాయిజిల్లాలో ఉన్న సోమందేపల్లి మండలం క్యాతగానచెర్లకు కూడా వెళ్లేది. ఈ క్రమంలో నూతన సంవత్సరం సందర్భంగా తన కుమారుడికి కొత్త బట్టలు తీసుకొని భర్తతో కలిసి సోమవారం గుమ్మగట్టకు వెళ్లింది. అయితే అక్కడ భర్తతో గొడవపడింది. తాను కాపురానికి వచ్చేది లేదని... నీకు విడాకులు ఇస్తానని ఆమె గొడవ పడినట్లు చంద్రశేఖర్ తండ్రికి తెలిపాడు. సోమవారం రాత్రి తన స్వగ్రామానికి వచ్చిన చంద్రశేఖర్ మంగళవారంరాత్రి 11 గంటల సమయంలో తమ ఇంట్లోనే భార్య చీరతోనే ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ మేరకు మృతుడి తండ్రి రామాంజనప్ప ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. అలాగే తన కుమారుడి చావుకు కోడలు షర్మిల, ఆమె అక్క రామాంజనమ్మే కారణమని ఆయన ఫిర్యాదు చేసినట్లు పోలీసులు తెలిపారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించామని, ఇద్దరు మహిళలపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ గురునాథ్ తెలియజేశారు.

మార్కెట్‌యార్డ్ కార్యదర్శిగా చంద్రమౌళి

హిందూపురం, జనవరి 3 : స్థానిక వ్యవసాయ మార్కెట్‌యార్డ్ ప్రథమశ్రేణి కార్యదర్శిగా చంద్రమౌళి బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన గూడూరు మార్కెట్‌యార్డ్ కార్యదర్శిగా పనిచేస్తూ పదోన్నతిపై హిందూపురానికి వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన ఆయనకు మార్కెట్ అధికారి కిషోర్, నాగేంద్ర, ఇతర సిబ్బంది అభినందనలు తెలిపారు.

దుప్పట్ల పంపిణీ

పెనుకొండ, జనవరి 3 : స్థానిక ఎంక్యాప గ్లోబల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పేదలకు ఉచితంగా దుప్పట్లు పంపిణీ చేస్తున్నట్లు ట్రస్ట్ చైర్మన్ కలీముల్లా తెలిపారు. ట్రస్ట్ స్థానిక కార్యాలయంలో బుధవారం ఆయన చేతులమీదుగా 200మంది నిరుపేద విద్యార్థులు, మహిళలకు దుప్పట్లు పంపిణీ చేశారు.